

నేడు సాధారణ పని దినం

ఏలూరు సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం మొదటి రోజు సాధారణ పనిదినం నిర్వహించనున్నారు. మాజీ ప్రధాని మంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1 వరకు సంతాప దినాలు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనవరి 1 సాధారణ పనిదినంగా పరిగణిస్తారు. జిల్లా అధికారులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కలుసుకోవచ్చు, కేక్ కటింగ్, టీ, కాఫీలు, పూలదండలు అనుమతించరు. సంతాప దినాలు పూర్తికానందున వేడుకలు జరుపరాదని కలెక్టరేట్ అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఆశలు ఆకాంక్షలు



కొత్త ఏడాది ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలు. వీటి వెంటే సరికొత్త సవాళ్లు. ఉచితంగా బస్సు ఎక్కాలని మహిళలు. వందనం కోసం తల్లి ఎదురుచూపులు. ప్రాజెక్టు పనులన్నీ కొలిక్కిరావాలని, గతం కంటే మరింత సంతృప్తిగా పంట, దిగుబడి, ధర చేతికందాలని రైతులు. నామినేటెడ్ కుర్చీకోసం నేతలు. చదువులో రాణించాలని విద్యార్థులు. కొత్తకొత్త ప్రయోగాలతో కూటమి ప్రభుత్వం.. ఈ దిశగానే నూతన అధ్యాయం దిశగా అడుగులు. మహిళలకు పోలీసుల రక్షాకవచం. సైబర్ నేరాలకు కళ్లెం. జిల్లాలో అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రాలు. పేకాట దగ్గర నుంచి కోడి పందేలు వరకు కట్టడి. శాంతి.. భద్రతకే అత్యధిక ప్రాధాన్యం. ఇలా ఒక్కొక్కటి ఒక్కో ఆశ. రాబోయే 365 రోజులు వచ్చిపడే ఉపద్రవాల నుంచి ప్రజలను రక్షించడం, ఒత్తిడి తగ్గించడం, ఆర్థికంగా వెసులుబాటు కల్పించ డం, రాజకీయాల్లో సమున్నతంగా వ్యవహరించేలా నేతలకు దిశ, దశ నిర్దేశించడం ఈ ఏడాదే అన్ని పార్టీల ముందున్న లక్ష్యాలు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆంగ్ల సంవత్సరానికి అంతటా జేజేలు. గత అనుభవాల క్రీనీడల నుంచి సరికొత్త వెలుగులు తెచ్చే కొత్త సంవత్సరానికి స్వాగతం. ఏడాది పొడుగునా సరికొత్త లక్ష్యాలను చేరుకోవాలని. అందరి ఆకాంక్ష ఇదే. ఇప్పటి నుంచే సరికొత్త పాఠాలు. విద్యార్థుల నుంచి ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, రైతులు.. ఇలా అన్ని వర్గాలు రాణించేలా కూటమి ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు పొంచి ఉన్నాయి. గత ఏడాది ఒక్కొక్కటిగా సంస్కరణలు చేస్తూ, పాత వాసనలు వదిలిస్తూ, ఒక్కో అడుగు ముందుకేస్తూ కొత్త ఏడాదిలోకి కూటమి ప్రభుత్వం అడుగు పెడుతోంది. ఇంతకుముందు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 ఇప్పటికీ అందరి నోట నానుతోంది. మిగతా రాష్ట్రాలకు దీటుగా పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడం ఒక ఎత్తయితే.. దానిని ఠంచన్‌గా అందించడం మరో ఎత్తు. అనుకున్నది అనుకున్నట్టుగా ఒక్కో పథకాన్ని లైన్‌లో పెట్టి ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేయడం మరొక ఎత్తు. సూపర్-6లో భాగమైన మహిళలు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి వాటికి ఈ ఏడాదే అంకురార్పణ జరగబోతుందని ఆశ. వీటితోపాటు ఇతర హామీల అమలుకు మహిళలు, ఇతర వర్గాలు ఎదురుచూస్తున్నాయి. కూటమి ప్రభుత్వ చర్యలతో మార్పును ఇప్పటికే స్వాగతిస్తూ వస్తున్న వారంతా పథకాల అమలులో వేచి చూసే ధోరణిలోనే ఓర్పు. విద్యా సంస్కరణల్లో కూటమి ఇప్పటికే తొలి అడుగు వేసింది.


ఏలూరులో పూల బొకే దుకాణాల వద్ద రద్దీ

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలులోకి వచ్చింది. దీనికితోడు పాత విధానాలను మార్చి చదువుల్లో నిలదొక్కుకునేలా అటు ఉపాధ్యాయ వర్గానికి, ఇటు విద్యార్థి లోకానికి సరికొత్త బాటలేస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచే సంస్కరణల ప్రభావం ఉండేలా జాగ్రత్తపడుతోంది. విద్యార్థులకు ఇచ్చే స్కూల్ బ్యాగ్‌ల దగ్గర నుంచి అన్నింటా జాగ్రత్త పడుతుంది. కొత్త జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలకు ఈ ఏడాదే శ్రీకారం చుట్టాల్సి ఉంది. పక్కాగా ప్రణాళిక, అమలు ఇప్పటి లక్ష్యాలు. వీటిని అందుకోవడానికే అందరిదీ ఆతృతే. వీటిలో సవాళ్లు ఎదురైనా అధిగమించేందుకు సర్కార్ సాహసిస్తోంది. ఇంకోవైపు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను సంతృప్తిపరిచేలా గడిచిన ఐదేళ్ల లోపాలను ఒక్కొక్కటిగా సవరించాల్సి ఉంది. వీటిలో పాత బకాయిలను కొంతలో కొంత సర్దుబాటు చేయాలి. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా వీటిని దారిలో పెట్టాల్సిన సవాల్ సర్కార్‌దే. పీఎఫ్ నుంచి డీఏ వరకు లక్షల్లో పేరుకుపోయిన బకాయి కోసం వేతన జీవులంతా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలోను పెను మార్పులకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవ సరం ఉంది. ఇప్పటికే బదిలీల పేరిట పాత వాసనలను దూరంగా ఉంచారు. కొన్నింటిలో మాత్రం ఆ వాసన ఇంకా పోలేదు. రాజకీయ జోక్యం, పక్షపాతం కొందరిలో సమసిపోలేదు. అందరికీ సమన్యాయం చేయాలనేదే ఉద్యోగ ధర్మం కాగా, దీనికి విరుద్ధంగా వ్యవహరించే వారికి ఓ షాక్ ఇవ్వాలి. ఈ ఏడాది యంత్రాంగంలో పెను మార్పులకు ఇదే అతి పెద్ద సంకేతం అయ్యేటట్టు చూడాలన్న సర్కారు ప్రభుత్వం వైపు ఉంది. జిల్లా కేంద్రంలో ప్రతీ సోమవారం సాగే వినతుల స్వీకరణ ఆర్డీవో, మునిసిపల్ కేంద్రాలకు విస్తరించాలని తలపె ట్టారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలకు ఇదొక పెద్ద వెసులుబాటు. పెన్షన్లు, సొంత గృహాలు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం వేలాది మంది ఎదురుచూపులు. టిడ్కో ఇళ్లు ఎవరి సొంతం చేస్తారో సర్కారు నిర్ణయించేది ఈ ఏడాదే. ఇప్పటికే బోగస్ పెన్షన్ల పరిశీలన పూర్తయ్యింది. ఒక రేషన్‌కార్డులోనే చేర్పులు, మార్పులకు అవకాశం. ఈ మూడింటిలో ప్రభుత్వ కీలక నిర్ణయానికి అవకాశం. కొత్త రోడ్ల నిర్మాణమే కాకుండా గుంతలు తేలిన రోడ్లకు ఇప్పటికే మరమ్మతులు కొలిక్కి వస్తున్నాయి. సంక్రాంతి లోపే గుంతలు రహిత రాష్ట్రంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు ఆశయం నెరవేరడానికి సమయం వచ్చింది.

- కొత్త ఏడాది సరికొత్త లక్ష్యాలెన్నో
- కూటమి ప్రభుత్వానికి సవాళ్లు
- సంస్కరణలకు నాంది కావాలి
- సాగు, తాగునీటికి ముందస్తు ప్రణాళిక
- నూతన విజయాలకు అంకురార్పణకు ఇదే సమయం



కేంద్రం ఓ చూపు చూడాలి

జిల్లాలో కొవ్వూరు-భద్రాచలం కొత్త రైల్వే లైను నిర్మాణం ఈ ఏడాదే ఆరంభమయ్యేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. ఇది ఒక కొలిక్కి వస్తే జిల్లాలో రవాణా రంగంలోనే సరికొత్త ఒరవడికి పునాది పడబోతుంది. ఇంకోవైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తి చేయాల్సి ఉంది. రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిగా అందించాలనే డిమాండ్ ఉంది. సూర్యఘర్ పేరిట సౌర విద్యుత్ జిల్లా అంతటా విస్తరించాల్సిన సమయమిది. ఈ దిశగానే ద్వారకాతిరుమలలో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు తొలి అడుగులు. ఇంకోవైపు బ్యాంకులు ఊతమిస్తే గృహ సముదాయాలపై సౌర శక్తికి మరింత చేయూతనిచ్చినట్టవుతుంది. పంటలకు కనీస ధర కల్పించడంలో గోధుమ పంట మాదిరిగానే వరి, ఇతర పంటలకు ఈసారి ధర పెరిగేలా కేంద్ర సహకారం అవసరం.

రాజకీయ సవాళ్లెన్నో..

ఒకవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాకుండా వీటిని అమలు చేయడం కూటమి ప్రభుత్వానికి ఈ ఏడాది సరికొత్త సవాల్. ముఖ్యంగా జనం ఏ వైపు మొగ్గు చూపుతున్నారో ఆ దిశగానే అడుగులు కదపాల్సిన అవసరం ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల తొలగింపు ఈ ఏడాదైనా జరుగుతుందనే ఆశతో అనేక మంది ఉన్నారు. ఈ కేసుల్లో భాగంగా కోర్టుల చుట్టూ తిరిగి కష్టాలు పడుతున్న వారంతా తమను గట్టెక్కించాలనే కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. ప్రత్యేకించి పార్టీ కోసం కష్టపడిన వారంతా తమకు గౌరవప్రదమైన నామినేటెడ్ పదవి దక్కాలని ఆశిస్తున్నారు. ఈ ఏడాదిలోనే మార్కెట్ కమిటీలు, సహకార కమిటీలు కూడా ఒక కొలిక్కి రాబోతున్నాయి. వీటికి తోడు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల కోసం క్యూ కట్టిన అనేక మంది కుర్చీ తమకే దక్కుతుందని ఆశతో కంటున్న కలలు సాకారం కావాలనుకుంటున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇప్పటికే బలపడి ఉండగా, వైసీపీ నిలదొక్కుకోవడానికి ఈ ఏడాది మరిన్ని ప్రయత్నాలు చేయబోతుంది. ఆ పార్టీ క్షేత్రస్థాయిలో దెబ్బతిని దిగాలు పడింది. రాజీనామాలతో పార్టీలో చాలా వెలితి కనిపిస్తోంది. దీని నుంచి బయటపడేందుకు ఆ పార్టీ అస్త్రశస్త్రాలకు ఈ ఏడాది పదును పెట్టాలని తెగ ఆరాటపడుతుంది. అంతో ఇంతో పాత వాసనలతో నెట్టు కొస్తున్న కాంగ్రెస్, వామపక్షాలు కూడా ఈ ఏడాదైనా కలిసొస్తుందని ఆశలు పెంచుకున్నాయి.



తాగు, సాగు నీరు

ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది తాగు, సాగునీటి కటకట ఏర్పడకుండా లక్ష్యాలు నిర్దేశించాలి. ఇప్పటికే సాగునీటి సౌకర్యం మెరుగుపరిచే దిశగా సర్కార్ వేగం పెంచాలి. రెండో పంట గట్టెక్కేలా, రాబోయే ఖరీఫ్ సరైన సమయంలో ఆరంభమయ్యేలా చర్యలకు దిగాలి. రైతుకు సరైన దిగుబడి రావడమే కాకుండా మార్కెట్‌లో ధర వరలు సంతృప్తికరంగా ఉండేలా చూసే బాధ్యత సర్కారుదే. ఈఏడాది పత్తి, మిరప, పొగాకు, పామాయిల్, వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఉద్యాన పంటల ప్రోత్సాహకానికి కేంద్ర, రాష్ట్రాల నుంచి మరింత ప్రోత్సాహకాలు అందేలా చర్యలు ఉండాలి. పోలవరం ప్రాజెక్టుతోపాటు చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలు ఓ కొలిక్కి రావాలి. మిగిలిన రిజర్వాయర్లలో సాగునీటి నిర్వహణ పద్ధతులు రావాల్సిందే. తాగునీటి అవసరాలను గుర్తించి ఆ మేరకు ముందస్తుగా జనవరిలోనే రంగం సిద్ధం చేయాలి. పంచాయతీరాజ్ శాఖ అప్రమత్తం కావాలి. కుళాయి నీరు కల సాకారమవ్వాలి. రైతు కూలీలకు ఉపాధి హామీ మరింత ఊతమివ్వాలి. ఇవన్నీ చేయాలంటే సర్కారుతోపాటు ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని విజయాలు సాధించాలి.



సందడే.. సందడి


జిల్లా అంతటా న్యూ ఇయర్ సంబరాలు

పండ్లు, పూల బొకేలతో పరస్పర శుభాకాంక్షలు

ఏలూరు సిటీ/రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సందడే సందడి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం అర్ధరాత్రి యువత కేరింతలు కొట్టారు. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2025 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఏలూరు నగరంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. ప్రత్యేకంగా ఫుడ్ ప్యాకెట్ల దుకాణాలు వాడవాడలా వెలిశాయి. ఆఫర్లతో బిరియానీ ప్యాకెట్లు అమ్మకాలు సాగించారు. పండ్ల దుకాణాలు బిజీగా కనిపించాయి. పూల బొకేలు అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. బేకరీ, స్వీట్ షాపులు కిటకిటలాడాయి. ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు చోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షల సందేశాలిచ్చారు.

హోటళ్లలో ప్రత్యేక ఆఫర్లు

ఇక హోటళ్లలో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. బిరియానీ, ఫ్రైడ్‌రైస్ కొనుగోలుపై డిస్కౌంట్, డ్రింక్ బాటిల్ ఉచితంగా ఇచ్చారు. నాన్ వెజ్ ఐటెమ్స్‌కు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. బేకరీ షాపులలో కేక్‌లకు మంచి గిరాకీ పెరిగింది. కేక్‌లను ముందుగానే ఇచ్చిన ఆర్డరుపై తయారు చేసి అమ్మకాలు చేశారు. సోషల్ మీడియా ప్రభావంతో గ్రీటింగ్స్ అమ్మకాలు బాగా తగ్గాయని చెబుతున్నారు. మార్కెట్‌లో పూలు, పండ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. బొకేలు, కేక్‌ల ధరలు రెట్టింపయ్యాయి. మద్యం షాపులు రద్దీగా కనిపించాయి. వస్త్రదుకాణాలు, మోటార్ సైకిల్, కార్ల షోరూంలు హడావుడిగా కనిపించాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయాలు, చర్చిలలో కూడా సందడి నెలకొంది.



ప్రజలకు మంచి జరగాలి : కలెక్టర్



నూతన సంవత్సరం ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ కె వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు 2025లో అంతా మంచి జరగాలని, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లాలో మంచి పంటలు పండి, విద్యా, పారిశ్రామిక అభివృద్ధి సాధించాలన్నారు. - ఏలూరు సిటీ

అంతా ప్రశాంతంగా ఉండాలి : ఎస్పీ



ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరాన్ని కుటుంబ సభ్యుల తో ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ కేపీఎస్. కిశోర్ అన్నారు. ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. 2025లో పోలీస్ శాఖ ప్రత్యేక లక్ష్యాలతో ముందడుగు వేస్తామన్నారు. జిల్లాలో నేరస్తులపై నిఘా పెట్టి ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని అదే విధంగా ప్రజలకు శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే రౌడీషీటర్లపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. - ఏలూరు క్రైం

రెవెన్యూ సదస్సులలో అర్జీలు
త్వరితగతిన పరిష్కారం

ఏలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభల్లో అర్జీలను త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తోందని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి పీజీఆర్ఎస్ (రెవెన్యూ) సదస్సులు, రీసర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో భూపరిపాలన, ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి పట్టాదార్ పాస్‌పుస్తకం, ఇళ్ల స్థలాలు, మ్యుటేషన్స్ తదితర అర్జీల పరిష్కార తీరును కలెక్టర్ కె.వెట్రిసెల్వి వివరించారు. జిల్లాలో 479 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, 4831 అర్జీలు స్వీకరించగా, 1793 అర్జీలు పరిష్కరించామన్నారు. కమిషనర్ జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులపై అధికారులు సదస్సులు ముగిసే వరకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రజల సంతృప్తిస్థాయి మెరుగ్గా ఉండేలా తహసీల్దార్లు పని చేయాలన్నారు.





అభివృద్ధే మా లక్ష్యం..

కొత్త ఏడాది వచ్చేసింది.. అందరూ కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటారు.. ఏమేం చేయాలో ప్రణాళికలు వేసుకుంటారు.. ప్రజాసేవలో మునిగితేలే ప్రజా ప్రతినిధులను కొత్త సంవత్సరంలో మీ లక్ష్యాలు ఏమిటని అడిగితే నియోజకవర్గంలో మౌలిక వసతులపై దృష్టి పెట్టడంతోపాటు అభివృద్ధిని సాధించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వివరించారు.. వారి మాటల్లోనే..

పేదలకు ఇళ్లు అందిస్తాం..



నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా. వచ్చే ఏడాది మార్చిలోపు పేదలకు ఐదు వేల ఇళ్లు ఇస్తాం. స్థలం ఉన్నవారికి రెండున్నర లక్షల రూపాయలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తాం. నగరంలో చిర కాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న శనివారపుపేట కాజ్వేను రూ.15 లక్షలతో నిర్మిస్తాం. జూట్‌మిల్లు ఎదురుగా వంతెనను రూ.5 కోట్లతో నిర్మిస్తాం. మిగిలిన ఏడు విలీన గ్రామాల్లో గోదావరి, కృష్ణాకాల్వల నుంచి రూ.126 కోట్లతో తాగునీరందిస్తాం. టిడ్కో గృహాలు అసలైన లబ్ధిదారులకు అందిస్తాం. ఏడుగోలీల సెంటర్‌లో రూ.65 లక్షలతో నూకాలమ్మ గుడిదగ్గర రూ.80 లక్షలతో రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేస్తాం.

-బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే

కొల్లేరు శాశ్వత పరిష్కారానికి కృషి



నియోజకవర్గంలో ప్రధానంగా డ్రైనేజీ, ఇరిగేషన్, తాగునీరు, రోడ్లు, ఆక్వా రంగం అభివృద్ధితో పాటు కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కావాల్సిన చర్యలను చేపడతాను. ఎక్కువ నిధులను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో నియోజకవర్గంలో అనేక మంది ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భూ సమస్యల పరిష్కారానికే కృషి చేస్తా. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించేలా చేస్తా. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా..

-డాక్టర్ కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే

ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తా..



నియోజకవర్గంలో అంతర్గత రహదారులు నిర్మిస్తాం. నారాయణపురం వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తా. కేశవరం వంతెన సమస్య దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఉంది. దీని నిర్మాణం చేపట్టి ప్రజల కోరిక తీరుస్తాం. తాడేపల్లిగూడెం భీమవరం రహదారిలో రిటైనింగ్ వాల్ నిర్మించి పకడ్బందీగా రహదారి నిర్మాణం చేస్తాం. జనవరి 20 నుంచి సర్వే చేయిస్తాం. ఫిబ్రవరి చివరకి సర్వే పూర్తి చేసి ఆక్రమణలు తొలగిస్తాం. నియోజకవర్గంలో 120 వివిధ రహదారులకు రూ.22.66 కోట్ల నిధులు మంజూరు చేసాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుతాం.

-పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే

వంతెనలు పూర్తిచేస్తాం..



నియోజకవర్గంలో బైనేరు, గుండేరు, పట్టెన్నపాలెం వంతెనల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. సంక్రాంతి లోపు రహదారులకు మరమ్మతులు పూర్తిచేసి తరువాత పూర్తిస్థాయిలో నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోను రోడ్ల నిర్మాణాలు చేపడతాం. నగర పంచాయతీలో 40 కోట్లతో సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్, డ్రైయినేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడతాం. నాగిరెడ్డిగూడెంలో నిర్మించిన 400 లబ్దిదారులకు ఇళ్ల అప్పగిస్తాం. 2025లో మరో రెండు వేల గృహాలు మంజూరు చేయించి నిర్మిస్తాం. నియోజకవర్గంలో సారా, గంజాయిలేని ప్రాంతంగా డ్రోన్‌తో పర్యవేక్షణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.

-సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే

ఏజెన్సీ రహదారులను అభివృద్ధి చేస్తా



గిరిజన గ్రామాలకు వెళ్ళే అన్ని రహదారులు గ్రామం లోని సీసీ రహదారులు నూతన సంవత్సరంలో పూర్తి చేస్తాం. నిర్వాసితుల సమస్యల పై ప్రత్యేక దృష్టి పెడతాం. గతప్రభుత్వంలో నిర్వాసి తులను పట్టించుకోలేదు. ఆ సమస్యలన్ని తీరుస్తాం. అదే విధంగా నియోజకవర్గంలో ఎక్కడా అసాంఘిక కార్యకలపాలు కొనసాగకుండా చర్యలు చేపడతాం. ఈ ప్రాంతంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలిస్తాం. అన్ని గ్రామాల్లోనూ పక్కాడ్రైన్లు నిర్మించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తాం.

- చిర్రి బాలరాజు , పోలవరం ఎమ్మెల్యే



వినూత్నంగా వీడ్కోలు

తణుకు పట్టణంలోని కొంతమంది విద్యార్థులు పాత సంవత్సరానికి వినూత్న పద్ధతిలో వీడ్కోలు పలికారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మంగళవారం ఉదయం పెరవలి రోడ్డులోని పట్టణంలో ముఖ ద్వారం వద్ద కళాశాల విద్యార్థులు శవ పేటిక తయారు చేసి దానిపై 2024కు వీడ్కోలు అంటూ రాసి డప్పులు కొడుతూ ఊరేగించిన వీడియో వైరల్ అయ్యింది.

- తణుకు,ఆంధ్రజ్యోతి

• చెప్పిందే చేసి చూపిస్తా



ఏలూరు పార్లమెంట్ నియోజకర్గం అభివృద్ధికి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం.పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల వారీగా ప్రధాన సమస్యల వివరాలతో కూడిన నివేదిక సిద్ధం చేసుకున్నాం. యువతకు సంబంధించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు పార్లమెంటు పరిధిలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నా. ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయటానికి ముందుకు వస్తున్న వ్యాపారవేత్తలతో సంప్రదింపులు జరిపాం. జాతీయ, రాష్ట్ర రహదారులు అభివృద్ధి, కొత్త రైల్వేస్టేషన్లు, రైల్వేస్టేషన్లలో ఆధునీకీకరణ, రైల్వే లైన్ల మంజూరుకు కృషి చేస్తున్నా. ఆయా సమస్యలపై ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందచేశా.

- పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఏలూరు ఎంపీ

సంక్షేమం..అభివృద్ధి.. ఇదే నా ఆకాంక్ష



నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయడమే లక్ష్యం. తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాల్లో ఇప్పటికే రహదారుల అభివృద్ధి చేపట్టాం. ప్రత్తిపాడు నుంచి బాదంపూడి వెళ్ళే రహదారి అభి వృద్ధికి చర్యలు తీసుకుంటాం. పట్టణ ప్రజలకు రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం. రెండవ సమ్మర్ స్టోరేజ్ పనులు త్వరత గతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. తాడేపల్లిగూడెంలో విమానాశ్రయ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. సాధించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తాం. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వినియోగంలోకి తేచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం.

-బొలిశెట్టి శ్రీనివాస్, విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే

ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు



నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ పథకంలో తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తాం. తణుకు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. పరిష్కారానికి కొత్తగా రోడ్డు నిర్మాణాలకు చేపడతాం. రైతులకు సంబంధించి వేసవి కాలంలో పంట కాలువలు పూడిక పనులు, వరద ముంపు నీటి సమస్య పరిష్కారం కోసం స్లూయిజ్‌ల నిర్మాణాలు చేపడతాం. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తా. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను.

- ఆరిమిల్లి రాధాకృష్ణ , తణుకు ఎమ్మెల్యే



నరసాపురంలో రంగులు కొంటూ...



ఆచంటలో టెంట్ వేసి కేక్‌ల విక్రయాలు

న్యూ ఇయర్ జోష్ !

రెస్టారెంట్లు, బేకరీ, పువ్వుల దుకాణాల వద్ద రద్దీ..

పూలు, బొకే ధరలకు రెక్కలు

ఆఫర్లే.. ఆఫర్లు

నరసాపురం/ ఆచంట/ పాలకొల్లు అర్బన్/ గణపవరం/పాలకోడేరు/ఏలూరుసిటీ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరాన్ని జిల్లా ప్రజలు ఉత్సాహంగా జరుపుకునేందుకు ఆసక్తి చూపారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్ అంతా సందడి.. సందడిగా కనిపించింది. రెస్టారెంట్లు, బేకరీ, పువ్వులు, స్వీట్స్, పండ్ల దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. రెస్టారెంట్లు, వైన్ షాపులు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు కిటకిటలాడాయి. మార్కెట్‌ను క్యాష్ చేసు కునేందుకు వ్యాపారులు పోటీపడ్డారు దుకాణాలు, రెస్టారెంట్ల వద్ద ఆఫర్ల బోర్డులు పెట్టి కస్టమర్లను ఆకర్షించారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంక రించారు. గణపవరం, పిప్పరలో మంగళవారం సాయంత్రం నుంచే న్యూయర్ సందడి నెలకొంది. ప్రధాన హోటల్స్‌లో విద్యుత్ కాంతులు విర జిమ్మాయి. డీజే సౌండ్ సిస్టమ్స్ వంటివి ఏర్పాటు చేశారు. హోటల్స్‌లో డిన్నర్‌కి సింగిల్స్‌కి ఒక రేటు కపుల్స్‌కి ఒక రేటు అంటూ వినియోగదారులకు ఆఫర్లు ప్రకటించారు. ప్రతీ ఇంటి ముందు రంగులతో



పాలకొల్లులో స్వీట్లు, పండ్ల అమ్మకాలు



నూతన సంవత్సర శుభాకాంక్షలు అనే ముగ్గులు వేసి మహిళలు మురిసిపోయారు.

నరసాపురంలో రెస్టారెంట్లు భారీ ఆఫర్లు ప్రకటించాయి. రూ..200లకు రెండు దమ్ బిర్యానీలు, ఇదే రేట్‌కు రెండు ఫ్రైపీస్ బిర్యానీలు ఆఫర్లు ఇచ్చారు. ఇవి కాకుండా చిన్న చిన్న రెస్టారెంట్లు కూడా దుకాణాల ముందు టెంట్‌లు వేసి మరీ అమ్మకాలు జరిపారు. రూ.150కి రెండు మినీ బిర్యానీలు ఇచ్చారు. దీంతో అన్ని షాపుల వద్ద రద్దీ కనిపించింది. బేకరీల వద్ద కూడా ఇదే సీన్ కనిపించింది. రెండు కేజీల కేక్ కొంటే అరకేజీ కేక్, కేజీ కేక్ కొంటే అరలీటర్ డ్రింక్ బాటిల్ ఫ్రీగా ఇచ్చారు. స్వీట్ షాపులు కూడా అన్ని రకాల స్వీట్‌లను కేజీగా కట్టి ఆఫర్ రేట్‌తో రూ.500లకు అందించారు. ఇక బోకే ధరలు చుక్కలంటాయి. చిన్న బోకే రూ.100 నుంచి రూ 150 పలికింది. పెద్దది అయితే రూ.250పైనే, ఇక పూల దండ ధర చిన్నది రూ 60పైనే ఉంది. ఇక పండ్ల ధరలు కూడా చుక్కలు చూపించాయి. నిన్న మొన్నటి వరకు కేజీ రూ.200 పలికిన యాపిల్స్ రూ.300 నుంచి రూ.400 అమ్మారు. కమలాలు కూడా కేజీ రూ.150 నుంచి రూ.200లకు అమ్మారు.

ప్రత్యేకంగా బిర్యాని సెంటర్‌లు..

2025 సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు ఆచంట మండల గ్రామాల్లో షాపులు సందడిగా మారాయి. ప్రత్యేకంగా టెంట్‌లు వేసి కేక్‌లు అమ్మారు. బిర్యానీ తయారీకి వీటికి అనేక ఆఫర్‌లు ఇవ్వడంతో కొనుగోలు దారులు ఎగబడ్డారు. రెండు బిర్యానిలు కొంటే ఒక బిర్యాని ఫ్రీ... రెండు కేక్‌లు కొంటే ఒక కేక్ ఫ్రీ.. ఒక బిర్యాని కొంటే కూలింగ్ బాటిల్ ఫ్రీ అంటూ.. ఫుడ్‌సెంటర్‌లు ఆఫర్‌లు పెట్టడంతో సాయంత్రం వరకు కొనుగోలు చేసే వారితో సందడి నెలకొంది.

తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో మంగళవారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలు సందడిగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి డి.రామకృష్ణ, యాడ్స్ మేనేజర్ గోపాలకృష్ణంరాజు కేక్ కట్ చేశారు. ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



నమ్మకాన్ని వమ్ము చేయను



కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు నదుల అనుసంధాన ప్రాజెక్టుల పనులు వేగవంతంగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారించనున్నాను. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పనులను తిరిగి ప్రారంభించనున్నాం. అత్యవసర పనుల కింద కాల్వలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాం.ఇప్పటికే కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులతో పాటు అత్యవసర పనులు చేపట్టాం.అతి కీలకమైన జల వనరుల శాఖను తనపై నమ్మకంతో అప్పగించిన చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తాను.

- డాక్టర్ నిమ్మల రామానాయుడు,జలవనరుల శాఖ మంత్రి , పాలకొల్లు ఎమ్మెల్యే

ఆచరణలో అభివృద్ధి



అభివృద్ధిని ఆచరణలో పెట్టాం. ఉండి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి డ్రెయిన్లు పూడుకు పోయాయి. ప్రభుత్వం నిధులు కేటాయించే పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్లు, కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే అయినప్పటినుంచి రైతులు, మిత్రుల సహకారంతో డ్రెయిన్లు బాగు చేశాం. పంటకాలువల్లోకి మురుగునీరు వదిలేసే పరిస్థితిని అరికట్టాం. పరిమళ్ల నుంచి పైప్‌లైన్ ప్రాజెక్ట్ ద్వారా ఉండి నియోజకవర్గానికి మంచినీటిని తీసుకు రావడమే ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నా. ఆక్వా రంగానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తాం.

రఘురామకృష్ణరాజు, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే

జిల్లా కేంద్రానికి తగ్గట్టుగా అభివృద్ధి



గ్రామాల అభివృద్ధి జరుగుతోంది. రానున్న కొత్త ఏడాది ఎంతో కీలకమైంది. ప్రభుత్వం మాపై ఎంతో నమ్మకం ఉంచింది. భీమవరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలి. భీమవరం మీదుగా వెళ్లే జాతీయ రహదారికి బైపాస్ నిర్ధారణ చేయాల్సి ఉంది. వీటిపై దృష్టి పెడతాం. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని ఒక కొలిక్కి తీసుకువస్తాం. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్‌లను పూర్తిచేస్తాం.పట్టణంలో పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, నిర్మాణ రంగం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటాం. కలెక్టరేట్ తోపాటు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఈ ఏడాది కృషి చేస్తాం.

-పులపర్తి అంజిబాబు, భీమవరం ఎమ్మెల్యే,

వారధి నిర్మించడమే నా లక్ష్యం



పశ్చిమగోదావరి కోనసీమ జిల్లాలను కలుపుతూ కోడేరు నుంచి గన్నవరం వరకు వారధి నిర్మించడమే ప్రధాన లక్ష్యం.. 2027లో జరగబోయే గోదావరి పుష్కరాలు పురస్కరించుకొని గోదావరి పరివాహక ప్రాంతాలను అతి సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పుష్కర ఘాట్‌లను నియోజకవర్గంలో ఉన్న పలు ఆలయాలను అభివృద్ధి చేస్తా. నియోజకవర్గంలో ఇప్పటికే గుంతలు లేని రహదారులను నిర్మించాం. రానున్న రోజులలో అన్ని గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం. అలాగే ఏటిగట్లను పటిష్టం చేస్తాం.ఆచంట నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను. ఈ ఏడాది అందరికి మంచి జరగాలని కోరుకుంటున్నా.

-పితాని సత్యనారాయణ, ఆచంట ఎమ్మెల్యే

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి



నియోజకవర్గంలో దశాబ్దాలుగా పరిష్కారం కాని పనులు చాలా ఉన్నాయి. వారధి నిర్మాణం, తీర గ్రామాలకు తాగునీటి కొరత నల్లిక్రిక్ తవ్వక పనులతో పాటు వియర్ ఛానల్ పనులు మధ్యస్థంగా నిలిచాయి. ఇవి కాకుండా గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించిన ఆక్వా యూనివర్సిటీ, సబ్‌స్టేషన్, ఏటిగట్టు పటిష్ఠం వంటి పనులు కూడా ఆగిపోయాయి. వీటిని పూర్తి చేయాల్సి ఉంది. పట్టణంలో శానిటేషన్‌తో పాటు కలుషితం లేని నీటిని అందించాల్సి ఉంది. వీటన్నంటికి ఈ ఏడాదిలో అధిక ప్రాధాన్యం ఇస్తా. ప్రజలందరికీ అందుబాటులో ఉండి వారి సమస్యల్ని పరిష్కరించాలన్నదే నా లక్ష్యం.

- బొమ్మిడి నాయకర్, విప్, నరసాపురం ఎమ్మెల్యే

"జనవరి 1 వద్దు- ఉగాది ముద్దు"

పాలకొల్లులో మార్కెట్ అంతా రద్దీగా కనపడింది. పువ్వుల ధరలకు సాధారణం కన్నా 50 శాతం అధికంగానూ. స్వీట్లు, కేక్‌లు గత ఏడాది కన్నా రెట్టింపు విక్రయిస్తున్నారు. వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ, గృహోపకరణ వస్తువుల షాపుల్లో రద్దీ కనపడింది. వివిధ రకాల స్వీట్లు షాపులు, బిర్యాని షాపులు రోడ్ల పక్కన వెలిశాయి. కొందరు హిందూ సంప్రదాయ వాదులు "జనవరి 1 వద్దు- ఉగాది ముద్దు" అనే నినాదంతో ప్రచారం చేస్తున్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ అపార్టుమెంటు ముందు జనవరి 1 వద్దు, ఉగాది ముద్దు అంటూ వేసిన ముగ్గుని చూసి పలువురు జనవరి 1 వేడుకలకు దూరంగా ఉంటామని చెబుతున్నారు.

కేజీ మటన్ కొంటే.. కేజీ చికెన్ ఫ్రీ



పాలకోడేరు మండలంలోని గొల్లల కోడేరు గ్రామంలో కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రజలను ఆకర్షించేందుకు వినూత్న రీతిలో కేజీ పోతు మాంసం కొంటే కేజీ చికెన్ ఫ్రీ, కేజీ చికెన్ కొంటే కేజీ ఉల్లిపాయలు ఫ్రీ అంటూ బ్యానర్లు పెట్టారు. ప్రజలు సైతం కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. గ్రామాల్లోను కేక్ కొంటే డ్రింక్ ఫ్రీ, బిర్యానీ కొంటే థమ్సప్ ఫ్రీ అంటూ ఆఫర్లతో హోరెత్తిస్తున్నారు.

3 నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ఏలూరు అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి అమలుచేయ తలపెట్టిన మధ్యాహ్న భోజన పథకం వాయిదాపడింది. విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి జిల్లాకు అందిన సమాచారం ప్రకారం ఇంటర్ విద్యార్థులకు జనవరి మూడో తేదీ నుంచి పథకాన్ని ప్రారంభించాలని మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని జిల్లావిద్యాశాఖవర్గాలు ధ్రువీకరించాయి. ఆ రోజున విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ మచిలీపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పథకాన్ని లాంచనప్రాయంగా ప్రారంభిస్తారని వివరించారు. కాగా జిల్లాలో మొత్తం 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా, వీటిలో డే స్కాలర్లుగా చదువుతున్న 2192 మంది విద్యార్థులకు భోజన పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు. ఇందుకుగాను సమీపంలోని హైస్కూళ్ళ నుంచి వండిన ఆహార పదార్థాలను ఆయా జూనియర్ కళాశాలలకు వాహనాల్లో రవాణా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్ని కళాశాలలు హైస్కూలు ప్రాంగణాల్లోనే ఉండగా, మరికొన్ని గరిష్ఠంగా 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆహారపదార్థాలను వండిపెట్టేందుకుగాను ప్రత్యేకంగా 39మంది కుక్ కం హెల్పర్లను నియమించారు. వీరికి గౌరవ వేతనాన్ని చెల్లిస్తారు. భవిష్యత్తులో సంబంధిత జూనియర్ కళాశాలల్లోనే ఆహారపదార్థాలను వండటానికి ప్రభుత్వం ఆదేశిస్తే ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిబ్బందినికూడా నియమించినట్లు విద్యాశాఖవర్గాలు తెలిపాయి. హైస్కూలు విద్యార్థులకు అమలవుతున్న మెనూనే ఇంటర్ విద్యార్థులకుకూడా వర్తింపజేస్తారు. కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే మరో 1668మంది హాస్టల్ అటాచ్డ్ విద్యార్థులుకూడా ఉన్నప్పటికీ వారంతా మధ్యాహ్న భోజనానికి సంబంధిత వసతిగృహాలకు వెళ్ళిపోతున్నందున కళాశాలల్లో భోజనం సరఫరాపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు.

కళాశాల భవన నిర్మాణానికి దీపక్ నెక్స్‌జెన్ రూ.కోటి విరాళం



చెక్కును సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడుకి అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ఏలూరు అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ విద్యాసంస్థలు నిర్వహిస్తోన్న నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత, సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ ఉపాధ్యక్షుడు అడుసుమిల్లి వెంకటసుబ్రహ్మణ్యం రూ.కోటి (సీఎస్ఆర్ ఫండ్) విరాళాన్ని బ్యాంకు చెక్కును మంగళవారం ఆ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.వి.బాలకృష్ణారావులకు అందజేశారు. సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, సంయుక్త కార్యదర్శులు కొడాలి వెంకట సుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ పాల్గొన్నారు.

గాంధీ భవనం అభివృద్ధికి కమిటీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పెదనిండ్రకొలను గ్రామంలోని మహాత్మా గాంధీ భవన అభివృద్ధి నిమిత్తం 2025 సంవత్సరానికిగాను నూతన కమిటీని ఏర్పాటు చేసినట్టు జిల్లా సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడుగా నడింపల్లి భీమరాజు, అధ్యక్షుడుగా ఎస్.ఎల్.ఎస్.బాపిరాజు, కార్యదర్శిగా ఇందుకూరి ప్రసాదరాజు, కోశాధికారిగా సాగి రాజు జానకిరామరాజు, కార్యనిర్వాహక సభ్యులుగా పెన్మత్స సత్తిరాజు, ఆర్.వి.ఎస్.రాజు, వేగేశ్న సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణమూర్తి, ఈపూరి సత్యనారాయణ, మరో పదిమంది సాధారణ సభ్యులతో కమిటీ ఏర్పాటైందని వివరించారు.

ఎస్సీ కుల గణనపై అభ్యంతరాలు

క్రైస్తవ మతం స్వీకరించిన వారికి ఎస్సీ కుల సర్టిఫికెట్లు ఇస్తున్నారు..

కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక వినతి పత్రం అందజేత



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సభ్యులు

భీమవరం టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఎస్సీ కుల గణనలో అభ్యంతరాలు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతి పత్రం సమర్పించారు. క్రైస్తవ మతం స్వీకరించిన ఎస్సీలు అనేక సంవత్సరాలుగా ఎస్సీ కుల సర్టిఫికెట్లు పొందుతున్నారని, రాజ్యాంగం ప్రకారం 1950 రాష్ట్రపతి ప్రకటన క్లాస్ (3) మేరకు హిందూ, బౌద్ధ, సిఖ్ మతాన్ని అవలంలంబించే వారే ఎస్సీలుగా పరిగణింప బడతారు. క్రైస్తవ, ఇస్లాం మతాలను స్వీకరించిన వారు ఎస్సీ పరిధిలోకి రారు అని పేర్కొందని అన్నారు. అనేక ఉన్నత న్యాయ స్థానాలు ఇదే దిశలో అనేక తీర్పులు ఇచ్చాయి కనుక ఎస్సీ కుల సర్టిఫికెట్లు ఇచ్చే ముందు మండల ప్రభుత్వ అధికారులు వారి ఇంటికి వెళ్లి, వారు ఏ మతస్థులు? అన్న విషయం పరిశీలించి, చుట్టు పక్కల వారిని వాకబు చేసి మాత్రమే ఎస్సీ కుల సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఇంతవరకు కొన్ని ఎస్సీ ఉప కులాలకు మాత్రమే తహసీల్దార్ కుల సర్టిఫికెట్లు ఇస్తున్నారు. మిగిలిన ఉప కులాలకు ఆర్డీవో వద్దకు వెళ్ళ వలసి వస్తోంది. దీని వల్ల ఆయా కులాల వారు కుల సర్టిఫికెట్లు పొందడం ఆలస్యం అవుతున్నది. అన్ని ఉప కులాల వారికి తహసీల్దార్ కుల సర్టిఫికెట్లు ఇచ్చేట్లు చూడాలని కోరారు. సుప్రీం కోర్టు తాజాగా ఎస్సీలలో ఉన్న అన్ని ఉప కులాలకు రాజ్యాంగ ఫలాలు అందేటట్లు అవసరమైన చర్యలు రాష్ట్ర ప్రభుత్వాలకు చేసే అధికారం ఉందని పేర్కొన్నది. కనుక కుల సర్టిఫికెట్లు ఇచ్చేటప్పుడు ఎస్సీ హిందూ అని రాయడంతో పాటు,వారి ఉపకులం కూడా రాయాలని కోరుతున్నామన్నారు. కలెక్టరుని కలిసిన వారిలో మాడుగుల దుర్గాప్రసాద్ అడపా బాలాజీ కమతం బాలు తిల్లంపూడి రమాదేవీ కమతం హరికిరణ్ రౌతు లక్ష్మీ అశ్విని తదితరులు ఉన్నారు.

పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

భీమవరం టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ పింఛన్‌దారులు, కుటుంబ పింఛన్‌దారులు ప్రతి సంవత్సరం సమర్పించాల్సిన లైఫ్ సర్టిఫికెట్ (వార్షిక ధృవీకరణ ప్రమాణ పత్రం)ను ఈనెల1వ తేదీ నుంచి తర్వాత మా త్రమే సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి అడారి గణేష్ మంగళవారం తెలిపారు. కొందరు పింఛన్‌దారులకు అవగాహనలేక ముందుగా వార్షిక ధృవీకరణ ప్రమాణపత్రం (లైఫ్ సర్టిఫికెట్) అందజేసినా, ఈనెల 1నుంచి వచ్చేనెల 28వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్ ద్వార అప్లోడ్ చేసిన వాటినే పరిగణలోనికి తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితులలోను డిసెంబర్ 31వ తేదీలోగా అందజేసినవి పరిగణలోనికి తీసుకోవడం జరగదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛనదార్లు తమ వార్షిక ధృవీకరణ ప్రమాణపత్రాలను (లైఫ్ సర్టిఫికెట్) ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోను, సి.ఎఫ్.ఎం.ఎస్ ద్వారా పెన్షనర్ సొంత లాగిన్ ద్వారా లేదా ఎన్.ఐ.సి. - జీవన్ ప్రమాణ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

నిత్యావసర సరుకులు బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు

భీమవరం టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : డీలర్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులు బ్లాక్ మార్కెట్లకు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో అన్ని మండలాల డీలర్ షాపుల అధ్యక్షులు, కార్యదర్శులు, సివిల్ సప్లై డీటీలు సిఎస్ఆర్‌ఐలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి నెల డీలర్ షాపులు ద్వారా సుమారు 5 లక్షల 7 వేల మంది కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పేదలకు పంపిణీ చేసే నిత్యవసర సరుకులు బ్లాక్ మార్కెట్లకు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత సంవత్సరంలో 676 ఎ కేసులు నమోదైతే 18 కేసులు డీలర్ల వద్దే జరిగినవే అన్నారు. ప్రతి డీలర్ షాపు వద్ద ఎంత సరుకు ఉంది పంపిణీ ఎంత జరిగింది వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని చెప్పారు. అధికారు లు తనిఖీలకు వచ్చి నప్పుడు స్టాకు సంబంధించిన వివరాలన్నీ ఈపాస్ మిషన్ లో డేటా రికార్డు చేసి పెట్టుకోవాలని అన్నారు.

అనధికార డంపింగ్‌లు నిరోధించాలి

పట్టణాల్లో అనధికారికంగా వ్యర్థాలను డంపింగ్ చేస్తున్న ప్రాంతాలను గుర్తించి నిరోధించాలని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మునిసిపల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్న వ్యక్తిని గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డంపింగ్ యార్డుల్లో చెత్తను తగులబెడుతున్న వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. నిబంధన విరుద్ధంగా చెత్తను బహిరంగ ప్రదేశంలో పారవేస్తున్న వారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి వారికి పెనాల్టీలు విధించాలన్నారు.సమావేశంలో మునిసిపల్ కమీషనర్ కె.రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

నేరాలు తగ్గాయి..

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



- దొంగతనాల నివారణకు ప్రత్యేక కెమెరాలు
- కొత్త ఏడాది మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా ప్రణాళికలు
- మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు
- పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఏడాది నేరాలు బాగా తగ్గాయని, అయితే సైబర్ నేరాలు బాగా పెరిగాయని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 2024 సంవత్సరం నేరాల పట్టికను ఆయన వివరించారు. 2022 ఏప్రిల్ నెలలో జిల్లా కొత్తగా ఏర్పడిందని, అప్పటి నుంచి పోలీస్ శాఖ నిత్యం 24 గంటలపాటు నేరాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతమైన పేరుపాలెం బీచ్‌లో డ్రోన్ ద్వారా నిరంతరం పోలీసు గస్తీ ఏర్పాటు చేయడంతో మునిగి చనిపోయిన వారి సంఖ్య గత ఏడాది 12 ఉండగా, 2024లో 3కు తగ్గిందన్నారు. డయల్ 112 వ్యవస్థను బలోపేతం చేసి ఆపద అనే మాట వినబడగానే తక్షణమే పోలీస్ సేవలు అందించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిందని తెలిపారు. దొంగతనాలు నివారణకు ప్రత్యేక కెమేరాలు జిల్లా అంతటా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2024 సంవత్సరం విజయవంతంగా ముగించి 2025లోకి ప్రవేశిస్తున్న పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ వి. భీమారావు, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, సీఐలు డి.వెంకటేశ్వరరావు, పుల్లారావు, కాశీచరణ్, జగదీశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

2024 నేర గణాంకాలు

2023వ సంవత్సరంలో జిల్లాలో మొత్తం 6022 కేసులు నమోదు కాగా, 2024వ సంవత్సరంలో 6,173 కేసులు నమోదయ్యాయి. 2023లో హత్య కేసులు 17 కాగా, 2024లో 15 ఉన్నాయన్నారు. 2023వ సంవత్సరంలో ఆస్తి నిమిత్తం హత్య ఒక కేసు నమోదుకాగా, 2024లో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. రోబరీ కేసులు 2023లో 4, 2024లో 14, డెకాయిటీ కేసులు 2023లో 4, 2024లో 2 కేసులు, దొంగతనాలు 2023లో 483, 2024లో 473 కేసులు నమోదయ్యాయన్నారు. 2024 సంవత్సరంలో 698 దొంగతనాలు జరగ్గా 350 నేరాలను ఛేదించడం జరిగిందని తెలిపారు. రూ.6 కోట్ల 78 లక్షల 44 వేల 821 మొత్తం చోరీకి గురికాగా, అందులో 3 కోట్ల 5 లక్షల 61 వేల 807 రూపాయల 65 పైసలు రికవరీ చేసినట్లు 45.05 శాతం నేరం సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామన్నారు. మహిళల పట్ల జరిగిన నేరాలు 2023లో 797 కాగా, 2024లో 768, బాలలపై లైంగిక నేరాలు 2023లో 91, 2024లో 93, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసులు 2023లో 104 కాగా, 2024లో 70, ఇసుక అక్రమ రవాణా కేసులు ఈ ఏడాది 4 కేసులు నమోదు చేసి 9 మందిని అరెస్ట్ చేసి 4 వాహనాలతోపాటు 55 యూనిట్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. రహదారి ప్రమాదాలు 2024 సంవత్సరంలో 538 ప్రమాదాలకుగాను 212 మంది మరణించారు. 326 మంది గాయపడ్డారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు 2024లో 922 కేసులు నమోదు చేశామన్నారు.

2024లో పోలీసు శాఖ సాధించిన కొన్ని విజయాలు

- 2024 డిసెంబరు 19వ తేదీన ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యండగండిలో చెక్కపెట్టెలో మృతదేహం పార్శిల్ కేసును చాకచక్యంగా స్వల్ప కాలంలో ఛేదించి ముద్దాయిలను అరెస్ట్ చేశారు.
- తాడేపల్లిగూడెం పట్టణంలో డిసెంబర్ నెలలో బంగారం, వెండి హోల్‌సేల్ వ్యాపారం పేరుతో జిల్లాలో 33 మంది బాధితుల నుంచి సేకరించిన రూ.85 లక్షల విలువ గల ఆరు కేజీల బంగారపు వస్తువులు, 106 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని మోసానికి పాల్పడిన దంపతులను అరెస్ట్ చేశారు.
- పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై నెలలో దొంగతనానికి వచ్చి ఒంటరిగా ఉంటున్న వృద్ధ మహిళపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఇద్దరు ముద్దాయిలను అతి తక్కువ సమయంలో అరెస్ట్ చేశారు.
- సెప్టెంబర్ నెలలో తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా ఉంటున్న మహిళ ఇంట్లోకి ప్రవేశించి ఆమెను హత్య చేసి మహిళ ఒంటిపై ఉన్న బంగారు నగలను, నగదును దొంగతనం చేసిన ముద్దాయిలను చాకచక్యంగా పోలీసులు అరెస్ట్ చేశారు.
- నవంబర్ నెలలో భీమవరంలో బందిపోటు దొంగతనానికి యత్నించిన 9 మంది నిందితులను అరెస్ట్ చేసి జిల్లా పోలీసు శాఖ ప్రతిభ కనబర్చింది.

నేరాల అదుపులో పోలీసుల సమష్టి కృషి

ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో పోలీస్ యంత్రాంగం సమష్టి కృషితో 2024 సంవత్సరంలో నేరాలు అదుపు చేయగలిగామని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణ, గంజాయి, సారా, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఆ చెక్‌పోస్టులు వద్ద 24 గంటలు వాహనాల తనిఖీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 38 హత్యలు జరిగాయని చెప్పారు. అన్ని కేసుల్లో హంతకులను అరెస్టు చేశామన్నారు. దారిదోపిడి కేసు ఒకటి నమోదు కాగా నలుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాది 242 ఇంటి దొంగతనాలు జరుగగా 60 శాతం కేసుల్లో నిందితులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 8.5 కేజీల బంగారం, 63 కేజీల వెండి వస్తువులు, 360 మోటారు సైకిళ్ళు, నాలుగు ఇతర వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గతంలో జరిగిన అనేక కేసుల్లో కూడా చోరీ సొత్తును రికవరీ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గించగలిగామన్నారు. ఈ ఏడాది 590 రోడ్డు ప్రమాదాలు నమోదు కాక, సెల్ఫ్ యాక్సిడెంట్లు 84 జరిగాయని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు చేయడం జరిగిందని, డ్రంకెన్ డ్రైవ్, ఫేస్‌వాష్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 1735 మందిపై కేసులు నమోదు చేసి 44 లక్షల 60 వేల 300 రూపాయలు అపరాధ రుసుము విధించడం జరిగిందన్నారు. జిల్లాలో సైబర్ క్రైమ్ కేసులు 95 నమోదు అయ్యాయని ఈ కేసుల్లో కోటి 15 లక్షల 6 వేల 651 రూపాయలు పోయాయని, ఇందులో 20లక్షల 5 వేల రూపాయలను బాధితులకు అందించగలిగామన్నారు. జిల్లాలో 417 మంది అదృశ్యం కేసులు నమోదు కాగా వారందరినీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. గతంలో అదృశ్యమైన మరో 34 మందిని కూడా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని అభయ రక్షక దళాన్ని ఏర్పాటు చేశామన్నారు. కోర్టు మానిటరింగ్ సెల్ ద్వారా ఈ ఏడాది కోర్టులలో విచారణ జరిగిన కేసుల్లో పది మందికి జీవిత ఖైదు, ఆరుగురికి పదేళ్ళ జైలు శిక్ష, ఒకనికి ఐదేళ్ళ జైలు శిక్ష, నలుగురికి మూడేళ్ళ జైలుశిక్ష, 13 మందికి మూడేళ్ళలోపు జైలు శిక్ష కోర్టు విధించిందని, అయితే సకాలంలో సాక్ష్యులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సమావేశంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వి మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, డీసీఆర్బీ ఎస్‌ఐ ఎం.రాజారెడ్డి, నూజివీడు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, పెదవేగి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన: ఐదేళ్ల జైలు శిక్ష

భీమవరం క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆడుకుంటున్న బాలికను గదిలోకి తీసుకువెళ్ళి అత్యాచారం చేయడానికి ప్రయత్నించిన ఒక వృద్ధుడికి భీమవరం పోక్సో కోర్టు మంగళవారం ఐదు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. భీమవరం రూరల్ ఎస్‌ఐ ఎం.వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలంలోని ఒక గ్రామానికి చెందిన మహిళ ఆరేళ్ళ వయస్సున్న మనుమరాలు 2019 జూన్ నెల 3వ తేదీన సెలవుల నిమిత్తం అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఆరోజు ఉదయం 11 గంటల సమయంలో ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటుంది. అదే గ్రామానికి చెందిన నంబూరి నరసింహరాజు (64) బాలికను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. అది గమనించిన బాలిక అమ్మమ్మ కూడా వెళ్ళింది. తలుపు గెంటడానికి ప్రయత్నించగా తలుపులు వేసి ఉండటంతో అనుమానం వచ్చి కిటికీ తలుపు తీసి చూడగా బాలికతో ఆ వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో బాలిక అమ్మమ్మ కేకలు వేయగా వృద్ధుడు పరారయ్యాడు. పోలీసులు వృద్ధుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నేరం రుజువు కావటంతో కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించింది. జరిమానా కట్టలేని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలుశిక్ష విధించారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆచంట డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి వేరొక వ్యక్తిని వివాహం చేసుకోవడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెలకొంది. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం ఆచంట మండలం ఆచంట వేమవరం శివారు పార్వతీచెరువుకు చెందిన కనపాల ఇస్మోల్‌రాజు (25) ఎవరో అమ్మాయిని ఇటీవల ప్రేమించగా ఆ యువతి వేరో వ్యక్తితో వివాహం చేసుకోగా మనస్తాపం చెందిన ఆ యువకుడు ఈనెల 29వ కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే వేమవరంలో ఉన్న పి.హెచ్.సి.లో ప్రథమచికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం లోని ఆసుపత్రికి తీసుకెల్లగా అక్కడా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం యువకుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి కనపాల పెద్దిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కట్టా వెంకటరమణ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

కోటి 62 లక్షల రూపాయల విలువైన వెండి, బంగారు వస్తువులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) :ఐదుగురు సభ్యుల అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరులోని ఇందిరమ్మ కాలనీ 7వ రోడ్డునకు చెందిన తేళ్ళ ఏసు (38) 2007 నుంచి 2016 మధ్య కాలంలో 18 దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించి విడుదలయ్యాడు. 2016 నుంచి 2021 వరకు ఆటో డ్రైవర్‌గా జీవించాడు. ఆ తరువాత పేకాటలకు వెళ్తు అక్కడ ఏలూరునకు చెందిన గండిపూడి రాజ్‌కుమార్ అలియాస్ నాని (30), పెదపాడు మండలం మేడిపాడు గ్రామానికి చెందిన సాయిల రాంబాబు(40), ఏలూరులోని వంగాయిగూడెం గాంధీకాలనీకి చెందిన దాసరి బాలరాజు (25), ఏలూరులోని చిరంజీవి బస్టాంప్ సమీపంలో నివాసం ఉంటున్న భీముల ఏసు (36)లు పరిచయం అయ్యారు. వీరిని ఒక ముఠాగా తేళ్ళ ఏసు ఏర్పాటు చేసుకుని 43 ఇళ్ళల్లో పగటిపూట రెక్కీ చేసి రాత్రి పూట నేరాలకు పాల్పడ్డారు. మొత్తం కోటి 50 లక్షల విలువైన రెండు కేజీల బంగారు ఆభరణాలు, 12 లక్షల విలువైన 13 కేజీల వెండి వస్తువులను అపహరించారు. వీరు నూజివీడు సర్కిల్‌లో 11 నేరాలు, పెదవేగి సర్కిల్ పరిధిలో 11, ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో 5, పోలవరం సబ్‌డివిజన్ పరిధిలో 1, కృష్ణాజిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 3 మొత్తం 43 నేరాలకు పాల్పడ్డారు. అప్పటి నుంచి ఎవరికి చిక్కకుండా పరారీలో ఉన్నారు. ముసునూరు ఎస్‌ఐ ఎం చిరంజీవి, చాట్రాయి ఎస్‌ఐ రామకృష్ణ, నూజివీడు రూరల్ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు వారి సిబ్బంది కలిసి గాలింపు చేపట్టారు. మొత్తం మీద ముసునూరు మండలం గుల్లపూడి గ్రామం అడ్డరోడ్డు వద్ద మంగళవారం ఉదయం ఈ ముఠా చిక్కారు. వీరి నుంచి కోటి 62 లక్షల విలువైన రెండు కేజీల బంగారు వస్తువులు, 13 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

రెండు ఇళ్లు దగ్ధం

ఐదు లక్షల నష్టం



ఏలూరు క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు తాటాకిళ్ళు దగ్ధమయ్యాయి. ఏలూరు రాణీనగర్‌లో నివాసం ఉంటున్న కాన్‌మాని సౌభాగ్యం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గ్యాస్ బండకు అంటుకుంది. దీంతో ఆ మంటలు పక్కనే ఉన్న అత్తోటి సుశీల ఇంటికి కూడా అంటుకోవడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఏలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందడంతో జిల్లా అదనపు ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ ఆధ్వర్యంలో అక్కడకు వెళ్ళారు. ఆ మంటలు చుట్టుపక్కల ఇళ్ళకు అంటుకోకుండా కాపాడారు. అప్పటికే ఆ రెండు తాటాకు ఇళ్ళు పూర్తిగా దగ్ధమైపోయాయి. దీంతో ఆ కుటుంబాలు కట్టుకున్న వస్త్రాలు మినహా ఎలాంటి వస్తువులు తెచ్చుకోలేకపోయారు. ఇంట్లో బంగారు వస్తువులు, నగదు, విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయని బాధితులు వాపోయారు. సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లుగా ప్రాథమికంగా గుర్తించారు.

యాసిడ్ దాడిపై పూర్తిస్థాయి విచారణ చేయండి : హైకోర్టు

ఏలూరు క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : 2023 జూన్ 13 రాత్రి ఏలూరు మానెస్త్రీ సమీపంలో నివాసం ఉంటున్న యడ్ల ఫ్రాన్సిక (30) పై ఇద్దరు వ్యక్తులు యాసిడ్‌దాడి చేయడంతో ఆమె చికిత్స పొందుతు మృతి చెందింది. ఈకేసులో ప్రధాన నిందితుడు ఏలూరుకు చెందిన బోడా నాగసతీష్, బెహరా మోహన్ (ఒడిషా), బూడిద ఉషాకిరణ్‌లను అరెస్టు చేశారు. వారికి యాసిడ్‌ను విక్రయించిన షాపు యజమాని, గుమస్తాను కూడా ఈ కేసులో అరెస్టు చేశారు. ఈ కేసు స్పీడ్ ట్రయల్ కేసుగా విచారణ ఏలూరులోని ఎస్సీఎస్టీ కోర్టులో జరిగింది. ప్రధాన నిందితుడు బోడా నాగసతీష్, రెండవ, మూడవ నిందితులైన బెహరా మోహన్, బూడిద ఉషాకిరణ్‌లకు గత ఏడాది అక్టోబర్ 11వ తేదీన జీవిత ఖైదు విధించారు. నాల్గవ, ఐదవ నిందితులకు సాధారణ జరిమానా విధించారు. ప్రధాన, మూడవ నిందితుల తరపున న్యాయవాది జిపి డానియేల్, హైకోర్టు న్యాయవాది విఊదయ్‌కుమార్‌లు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది సీహెచ్ నాగేశ్వరరావు వాదనలను వినిపించారు. స్పీడ్ ట్రయల్ పేరుతో కేసు త్వరితగతిన విచారణ జరిపారే తప్ప నిందితులకు, న్యాయవాదులకు కాని జిల్లా సెషన్స్ కోర్టులో సమయం ఇవ్వలేదని పూర్తిస్థాయిలో అన్ని అంశాలను విచారణ చేయలేదని, ఉద్దేశ పూర్వకంగా స్పీడ్ ట్రయల్ పేరుతో తీర్పు ఇచ్చారని కోర్టు ముందు తమ వాదనలను వినిపించారు. నిందితులు తరపున న్యాయవాదుల వాదనలు విన్న హైకోర్టు ఏకీభవించింది. దీంతో ఈ కేసును మొదటి నుంచి పూర్తిస్థాయి విచారణ జరపాలని, ప్రస్తుతం జైలులో ఉన్న నిందితులు జిల్లా కోర్టులోనే బెయిల్ పొందవచ్చునని సూచించారు. దీంతో ఈ కేసు మళ్ళీ జిల్లా కోర్టులో యథావిధిగా విచారణ కొనసాగుతుంది. జిల్లా కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేశారు.

గోదావరిలోకి దూకిన యువకుడు

నీటిలో కొట్టుకుపోతుండగా దిండి రిసార్ట్స్ బోటింగ్ సిబ్బందికి సమాచారం ఇచ్చిన ఆంధ్రజ్యోతి

ఒడ్డుకు చేర్చిన బోటింగ్ సిబ్బంది



బాల ఏసు

యలమంచిలి, డిసెంబరు 31 (ఆంధ్ర జ్యోతి): చించినాడ బ్రిడ్జిపైన ఒక యువకుడు మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో రెయిలింగ్‌ను పట్టుకుని నిలబడి తన దగ్గరకు ఎవరూ రావద్దు.. వస్తే గోదావరిలోకి దూకేస్తాను అని హెచ్చరించాడు. అక్కడ ఉన్న స్థానికులు, హైవే పోలీసింగ్ సిబ్బంది యువకుడిని గోదావరిలోకి దూకొద్దని వారించారు. నీ సమస్య ఏమిటో చెప్పు మేము పరిష్కరిస్తాము ఇవతలి వైపుకు వచ్చేయి.. అంటూ యువకుడిని స్థానికులు, హైవే పోలీసులు సుమారు అరగంటకుపైగా వారించారు. ఈ నేపథ్యంలో స్థానికులు వివరాలు అడుగుతుండగా తనది ముత్యాలపల్లి అని.. తన తల్లిని తిట్టారని మాత్రమే చెప్పాడు. ఆ తర్వాత ఆ యువకుడు గోదావరిలోకి దూకేశాడు. యువకుడు గోదావరిలో ఈత కొడుతూ చాలా దూరం వెళ్ళడాన్ని బ్రిడ్జిపై ఉన్నవారు గమనించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి దిండి రిసార్ట్స్‌కు చెందిన బోటింగ్ ఇన్‌చార్జి సుబ్బారావుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బోటింగ్ సిబ్బంది బోట్‌తో వచ్చి గోదావరిలో యువకుడిని గాలించి యువకుడిని ఒడ్డుకు చేర్చారు. చించినాడ బ్రిడ్జిపై ఈ సంఘటన సుమారు గంటకు పైగా జరిగింది. బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న చాలామందికి ఈ సంఘటన ఏంజరుగుతుందో.. యువకుడు గట్టుకు చేరితే బాగుండనని ఆశించారు. పోలీసులు యువకుడిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గోదావరిలోకి దూకిన యువకుడు ముత్యాలపల్లి గ్రామానికి చెందిన బాలం బాలఏసు అని స్థానిక పోలీసులు తెలిపారు.

రాళ్లకుంటలో వ్యవసాయ కేబుళ్ల చోరీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కేబుళ్లనే టార్గెట్ చేసి కొందరు కేటుగాళ్లు విజృంభిస్తూ వాటిని తస్కరించి సొమ్ముచేసుకుంటున్నారు. సోమ, మంగళవారాల్లో రాత్రివేళ పలువురు రైతులకు చెందిన కేబుళ్లను తెంపుకుని పోవడంతో వారు లబోదిబో మంటున్నారు. దీంతో వారు ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. రాళ్లకుంటకు చెందిన పదిమంది రైతుల భూముల్లో వేలాది రూపాయల విలువైన రాగి వైరును వారు దర్జాగా తస్కరించారు. ఇటీవల సమీప గ్రామమైన కొమ్మరలో సైతం ఇలా చేయడంతో బోర్ల కింద సాగ వుతున్న కోకో, కొబ్బరి, వరి, పామాయిల్ తదితర పంటలకు నష్టం వాటిల్లుతోందని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదే తరహాలో గతనెలలోనూ పలువురు రైతుల పొలాల్లో కేబుళ్ల తస్కరణకు గురయ్యాయి.

పేదలకు రిటైర్డ్ ఎంపీడీవో చిన్న కోటయ్య దుస్తుల వితరణ

భీమడోలు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-4లో రిటైర్డ్ ఎంపీడీవో చిన్న కోటయ్య ఆర్థిక సాయంతో 75 మంది పేద మహిళలకు చీరలు, 25 మంది పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ పేదవారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.



పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ..

కూటమి ఘనతే

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పింఛన్లు ఒకరోజు ముందుగానే అందిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మంగళవారం తెల్లవారుజామున 15, 16 డివిజన్లలో పింఛన్లు ఎమ్మెల్యే చంటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఆందోళన చెందేవారని, కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి 1వ తేదీకి ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర కమిషనర్ భానుప్రతాప్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, ఎంఆర్‌డీ బలరామ్, పాల్గొన్నారు.

లింగపాలెం: రాష్ట్రాభివృద్ధికి పాటుపడే వ్యక్తి మన ముఖ్యమంత్రిగా రావడం ప్రజల అదృష్టమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో కూటమి నాయకులతో కలసి పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు నూతన సంవత్సర కానుకగా ఒకరోజు ముందే కూటమి ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ చేసి వారిలో ఆనందం నింపిందన్నారు.

తలసేమియా బాలికకు పింఛన్ అందజేత

ద్వారకాతిరుమల: తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న తిమ్మాపురం బాలికకు నూతనంగా మంజూరైన పింఛన్‌ను రూ.10 వేలు మంగళవారం టీడీపీ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీవల్లి కొన్నాళ్లుగా ఈ వ్యాధితో బాధపడుతోంది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో బాలికకు పింఛన్ మంజూరైంది. పోలిన శ్రీను, కొయ్యలమూడి సరిత, గరిమెళ్ల రాంబాబు, ఏపూరి కిషోర్ ఉన్నారు.

టి.నరసాపురం: మండలంలో 7686 మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ విజయవంతంగా నిర్వహించినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావులు తెలిపారు. కేతవరం, వీరభద్రవరం గ్రామాల్లో మంగళవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్‌లు పంపిణీ చేశారు



పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం ది.ఏలూరు పట్టణ కొప్పుల వెలమ కుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు బీమవరపు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చిర్రి సమీక్ష

జీలుగుమిల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెల్లో పండుగ వాతావరణం కన్పిస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ, ఉపాధి అధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. జనసేన అధికార ప్రతినిధి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, ఎంపీటీసీ నాలి శ్రీను, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫౌంటేన్లు ప్రారంభం

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే చంటి అన్నారు. జూట్ మిల్లు వద్ద అశోక్‌నగర్ సెంటర్‌లో తంగెళ్ళమూడి వద్ద రూ.96 లక్షలతో నిర్మించిన మూడు వాటర్ ఫౌంటేన్లను మంగళవారం ఆయన ప్రారంభించారు.

జిల్లా సమాఖ్య కార్యవర్గ ఎన్నిక

పెదపాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని టీటీడీసీలో జిల్లా సమాఖ్య పాలక వర్గ సమావేశాన్ని డీఆర్‌డీఏ పీడీ డాక్టరు ఆర్.విజయరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా పూసం గంగా భవానీ (బుట్టాయిగూడెం), ఉపాధ్యక్షురాలిగా ఆవుల స్వర్ణకుమారి (మండవల్లి), కార్యదర్శిగా తోట కృపామణి (కొయ్యలగూడెం), సహాయ కార్యదర్శిగా సయ్యద్ సుల్తాన్ (ఉంగుటూరు), కోశాధికారిగా గోళ్ళ శాంతకుమారి (ఆగిరిపల్లి)లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని మండల సమాఖ్యల సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించండి: ఆర్డీవో

బుట్టాయగూడెం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వినతుల సత్వర పరిష్కారానికి రెవెన్యూ అధికా రులు చర్యలు తీసుకోవాలని జంగారెడ్డి గూడెం ఆర్డీవో ఎన్‌వి రమణ సూచించా రు. మంగళవారం బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించా రు. అధికారులతో మాట్లాడుతూ మీ-సేవా సర్వీసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు, డీటీ పాయం రమేష్ సిబ్బంది ఉన్నారు.

పదో తరగతే కీలకం : డీఈవో

దెందులూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పదో తరగతి అత్యంత కీలకమని పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లోకి వెళ్లాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. మంగళవారం కొవ్వలి జడ్పీ హైస్కూల్‌ను ఆమె పరిశీలించారు. మధ్యాహ్న భోజనంతో పాటు తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు అర్బన్: ఏపీటీఎఫ్-1938 జిల్లా శాఖ ముద్రించిన నూతన సంవత్సర డైరీని మంగళవారం డీఈవో ఆవిష్కరించి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి యత్నిస్తానన్నారు. సంఘ నాయకులు జి.కృష్ణ, రత్నంబాబు, మోహన్, రామ్మోహన్, దుర్గారావు, ఉమామహేశ్వరరావు, రాజు, శ్రీనివాసరావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్టీయే కాలెండర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీయే)జిల్లాశాఖ ముద్రించిన నూతన సంవత్సర వాల్/స్టిక్కర్ క్యాలెండర్లను మంగళవారం డీఈవో ఆవిష్కరించారు.

త్వరలోనే కొత్త భవనాల్లోకి ఏరియా ఆస్పత్రి : రోషన్

చింతలపూడి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి భవనాలను పూర్తి చేసి త్వరలోనే కొత్త భవనాల్లోకి ఏరియా ఆసుపత్రి తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

జనవాణికి వినతుల వెల్లువ

ఉంగుటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా జనవాణి-ప్రజా సమస్యల పరిష్కార వేదికను మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నిర్వహించారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, తగాదాల పరిష్కరించాలని సుమారు 500 అర్జీలు అందాయి. వాటిని సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలకు అందించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం..

గ్రామాలలో లో-వోల్టేజి సమస్యపై విద్యుత్ అధికారులు తక్షణం స్పందించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి మంగళవారం ఉంగుటూరు రైల్వే గేటు అవతల లోవోల్టేజి సమస్య పరిష్కారానికి రూ.12లక్షలతో విద్యుత్తు ట్రాన్స్‌పార్మర్, లైనును ఏర్పాటు చేయించి కలక్టర్ ప్రారంభించారు. సర్పంచ్ బండారు సింధు మధు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో ధర్మరాజుతో కలసి ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న కలెక్టర్



రోడ్డు సమస్య పరిష్కరిస్తా : చింతమనేని

పెదవేగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలవరం కుడికాలువ తవ్వకం సమయంలో పొలాలకు వెళ్లే దారులు పోయాయని, వేరొకరి పొలాల్లోంచి తిరుగుతున్నామని, రహదారి ఏర్పాటు చేయాలని గార్లమడుగు పంచాయతీ వెంకటకృష్ణాపురం గ్రామస్తులు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు విన్నవించారు. దుగ్గిరాల కార్యాలయంలో మంగళవారం పలువురు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభాకర్ సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి, రహదారి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్‌లో తేడాలు సరిచేస్తాం

పెదవేగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తమ భూమి ఆన్‌లైన్‌లో వేరొకరి పేరున ఉందని, దానిని సరిచేయాలని గ్రామసభలో రైతులు అధికారులకు విన్నవించారు. న్యాయంపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో పలువురు రైతులు వివిధ సమస్యలపై వినతులు అందించారు. సర్వే జరిపి సరిహద్దు సమస్య పరిష్కరించాలని, ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్యలను తొలగించి, మా భూమి మాదే అని ధృవీకరిం చాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసీల్దారు భ్రమరాంబ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో తేడాలను సరిచేస్తామని, ఇతర భూసమస్యలపై విచారణ చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్ఐ సారథి, సర్వేయర్ సత్యనారాయణమూర్తి, వీఆర్వో బాబుల్ సాహెబ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో లక్ష్యం చేరుకోవాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికను సిద్ధం చేసుకుని ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించడానికి నిరంతరం కృషి చేస్తూనే ఉండాలని కేఆర్ పురం ఐటీడీఏ ఏపీవో, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వీవీఎస్ నాయుడు, ఓఎన్జీసీ డీజీఎం సొంనాథ్ అన్నారు. రాజమహేంద్రవరం ఓఎన్జీసీ సామాజిక బాధ్యత పథకంలో భాగంగా కేఆర్ పురం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ఆవరణలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై సెమినార్ నిర్వహించగా డీడీ, డీజీఎం పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గట్టం మాణిక్యాలరావు, స్కిల్ డెవలప్‌మెంట్ నిపుణుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాది నూజివీడుకు వరాలు : మంత్రి సారథి



నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ నూజివీడు నియోజకవర్గానికి అనేక వరాలు అందనున్నాయి. మంగళవారం నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. నూజివీడు అభివృద్ధిపై ఆయన మాటల్లోనే..

- రూ.100కోట్ల వ్యయంతో నూజివీడు నియోజకవర్గానికి జలజీవన్‌మిషన్ ద్వారా తాగు, సాగునీటి పంపిణీ
- పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నూతనంగా రింగ్ రోడ్డు ఏర్పాటు పనులు ప్రారంభం.
- నూజివీడు ఏఎంసీ వేదికగా మామిడి మార్కెట్ యార్డు ఏర్పాటు.
- చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.
- విద్య, క్రీడలకు నూజివీడు పుట్టినిల్లు. అయితే క్రీడాభివృద్ధికి అవసరమైన క్రీడాస్థలాలు లేకపోవడంతో లోటు ఉంది. దీన్ని పరిష్కరించేందుకు ఇండోర్ స్టేడియం పూర్తి చేయడంతో పాటు అవుట్‌డోర్ స్టేడియాన్ని నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నాం.
- నూజివీడు పట్టణంలో డ్రెయినేజి వ్యవస్థ అభివృద్ధికి చర్యలు
- ఆగిరిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఘాట్‌రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. దాన్ని ఈ ఏడాది పూర్తి చేస్తాం.

- నూజివీడు

బాధితులను ఆదుకుంటాం

ఏలూరు టూ టౌన్: ఇళ్ళు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇజ్రాయిల్‌పేటలో షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమై నిరాశ్రయులైన బాధితులను పరామర్శించారు.

వితరణలు..

బాధితులకు మన్నా చర్చ్ ఆధ్వర్యంలో పాస్టర్ ఎం.జ్యోతిరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు బియ్యం, వంట సామాగ్రి, దుప్పట్లు, దుస్తులు బాధితులకు పంపిణీ చేశారు. కాగా సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పెరికే వరప్రసాదరావు 25 కేజీల బియ్యం, పాలు అందించారు.

ఎస్ఐలకు పదవీ విరమణ సత్కారం

ఏలూరు క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రిమార్కులు లేకుండా కానిస్టేబుళ్ళుగా చేరి ఎస్ఐలుగా పదోన్నతులు పొంది ఉద్యోగ విరమణ అభినందనీయమని ఎస్పీ కిషోర్ అన్నారు. కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్. సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణారావు మంగళవారం పదవీ విరమణ చేశారు. వారిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వారిని సత్కరించారు. ఆర్ఐ పవన్‌కుమార్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, పదవి విరమణ చేసిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఎస్ఐలను సన్మానిస్తున్న ఎస్పీ

శ్రీవారి సేవలో ఎంపీ హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మంగళవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. బంగారు వాకిలి నుంచి లోపలకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించారు. డిప్యూటి ఈవో బాబూరావు స్వామివారి మెమెంటో , ప్రసాదాలను అందజేశారు.

ఉచిత వివాహ పరిచయ వేదిక

ఏలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వాహకులు గురుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్నేహం అసోసియేషన్ అధ్యక్షుడు అంబికా రాజా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి వివాహ పరిచయ వేదికల ద్వారా ఉన్నతమైన, ఆదర్శవంతమైన విలువలతో కూడిన బ్రాహ్మణ సమాజ నిర్మాణానికి దోహద పడుతుందన్నారు. గురుశర్మ మాట్లాడుతూ వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొని సంబంధాలు ఖాయం చేసుకోవచ్చన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముఖ్యమంత్రి దృష్టికి కైకలూరు సమస్యలు

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లానని, పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి ముఖ్యమంత్రిని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని రహదారులు, మంచినీటి దుస్థితిని వివరించడంతో పాటు భూసర్వేలో జరిగిన తప్పుల వలన రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రికి వివరించారు. సర్వేలో ఆలయాలకు చెందిన భూములు, మిలటరీ భూముల వివరాలను మార్చివేసి 22ఎలో పెట్టారని దీనివలన రైతులంతా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే కొల్లేరు ప్రజల యొక్క స్థితిగతులను ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. వీటిపైన ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

ముదినేపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఐ.దుర్గా ప్రసాద్ కోరారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల ప్రచారజాతా కూడా జయప్రదం చేయాలన్నారు.



కైకలూరులో రంగుల విక్రయాలు, ముదినేపల్లిలో ముగ్గులు వేస్తున్న చిన్నారి, మిఠాయిల విక్రయాలు, కలిదిండిలో కొత్త సంవత్సరానికి విద్యార్థుల స్వాగతం

గ్రామాలు, పట్టణాల్లో నూతన సంవత్సర సందడి

కైకలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. కైకలూరు మార్కెట్‌లో మంగళవారం న్యూ ఇయర్ సందడి నెలకొంది. ముందస్తు ఆర్డర్లతో స్వీట్లు, బేకరీ దుకాణాలు కిటకిటలాడాయి. వినియోగదారుల అభిరుచులు ఆర్డర్ల అనుకూలంగా దుకాణాదారులు ప్రత్యేక డిజైన్లతో కేక్స్ స్వీట్స్ సిద్ధం చేశారు. బేకరీలు విభిన్నరకమైన ఫ్లేవర్స్ డిజైన్లతో కేక్‌లను తయారుచేస్తున్నారు. పూల దుకాణాల్లో భారీ బొకేలను ఆకర్షణీయంగా తయారయ్యాయి. బిర్యానీ దుకాణాలు పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. కొత్తగా దుకాణాలను ఏర్పాటుచేసి ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించారు. ఇళ్ల వద్ద కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు వివిధ డిజైన్లతో ముగ్గులు వేసేందుకు రంగులు కొనేందుకు వినియోగదారులతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. న్యూఇయర్ వేడుకలను పెద్దఎత్తున నిర్వహించుకోవాలని యువత పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం రాత్రి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు కేరింతలు కొట్టారు. కేక్ కట్ చేసి సందడి చేశారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్ ముందు మహిళా పోలీసులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గు ఆకట్టుకున్నది. ముదినేపల్లి, సింగరాయపాలెం, అల్లూరు, గురజ, వడాలిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ధమ్ బిరియానీ, నాన్ వెజ్ కర్రీల అమ్మకాలు జోరుగా సాగాయి. మద్యం ప్రియుల హడావిడి పెద్ద ఎత్తున కనిపించింది. మద్యం షాపుల వద్ద భారీగా జనం బారులు తీరారు.

కలిదిండిలో..

కలిదిండి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మంగళవారం న్యూ ఇయర్ వేడుకల సందడి నెలకొంది. సెంటర్‌లో కేక్‌ల దుకాణాలు, పూలు, పండ్ల దుకాణాల వద్ద జనం కిటకిటలాడారు. కలిదిండి సెంటర్ మంగళవారం జనంతో కళకళలాడింది. ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

95 శాతం పెన్షన్ల పంపిణీ

ముదినేపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ మంగళవారం 90 శాతం పూర్తయింది. నూతన సంవత్సరానికి ముందు రోజే పెన్షన్ల పంపిణీ పట్ల పెన్షనర్లు కూడ హుషారుగా కనిపించారు. మండలంలో 8860 మంది పెన్షనర్లకు రూ.3.79 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 8417 మందికి రూ.3.60 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు పలు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. అల్లూరులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, బొమ్మినంపాడు మండల పార్టీ ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, జనసేన నాయకుడు బాసినశెట్టి కిషోర్, ములకలపల్లి, శ్రీహరిపురం, పెదపాలపర్రు, చిగురుకోటలో తెలుగు రైతు నాయకులు చలసాని జగన్మోహనరావు, బొప్పన సుందరరామయ్య, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, చల్లగుళ్ల ఆదిత్య పెన్షన్లు పంపిణీ చేశారు.

వెసులుబాటుతో తగ్గిన పెన్షన్ల పంపిణీ

రెండు నెలలు పెన్షన్లు తీసుకోకపోయినా మూడో నెలలో మూడు నెలల పెన్షన్లు తీసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుతో తొలిరోజు పంపిణీ శాతం తగ్గింది. ఇంతకు ముందు ముదినేపల్లి మండలంలో ప్రతీ నెలా పెన్షన్ల పంపిణీ 97 శాతం నుంచి 98 శాతం మొదటి రోజునే పూర్తయ్యేది. డిసెంబరులో 3 శాతం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉండే పెన్షనర్లు తొలిరోజు పెన్షన్లు తీసుకునేందుకు రాలేదు.

ఆర్థిక సంఘం నిధులతో పంట కాల్వ అభివృద్ధి

ముదినేపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగొన్నూరు మంచినీటి చెరువుకు నీటిని సరఫరా చేసే పంట కాల్వ అభివృద్ధి పనులను పంచాయతీ చేపట్టింది. పెదగొన్నూరు ఛానల్ నుంచి సుమారు కిలోమీటరన్నర దూరం కాల్వలో పూడిక తవ్వకం పనులను సర్పంచ్ తాడంకి శిరీష, కార్యదర్శి గిరిజ ఆధ్వర్యంలో సుమారు రూ.50 వేల పంచాయతీ నిధులతో మంగళవారం ప్రారంభించారు. దీంతో మంచినీటి చెరువుకు నీటిని సకాలంలో పుష్కలంగా సరఫరా చేసే అవకాశం కలుగనుంది. నిధుల కొరతతో చాలా కాలంగా ఈ పంట కాల్వను బాగు చేయలేకపోయారు. ఇప్పుడు పంచాయతీకి జమ అయిన ఆర్థిక సంఘం నిధులతో పంట కాల్వను అభివృద్ధి చేస్తున్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ భూములను గ్రామ కంఠం స్థలాలను నిషేధిత భూముల జాబితాల నుంచి తొలగించాలని కోరుతూ మంగళవారం దేవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు అర్జీలు అందజేశారు. గ్రామ పరిధిలోని రిజిస్టర్డ్ భూములు, ఇళ్ల స్థలాలు కూడ 22ఏ సెక్షన్లలో చేర్చడం వల్ల క్రయ విక్రయాలు జరుగక, రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వల్లభనేని సతీష్, బేతపూడి వెంకటరమణ, మంగమ్మ, పిండెల్లి ప్రసాద్ తదితరులు రీసర్వే డీటీ యు.శ్రీనివాస ప్రసాద్‌కు తెలిపారు. కాకరవాడలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడ జాయింట్ ఎల్‌పిలు విభజించి సబ్ డివిజన్ చేయాలని రైతులు కోరారు. ఇన్‌చార్జ్ సర్పంచ్ ఇంటేటి గణేష్, వీఆర్వో ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు


కలిదిండి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు మంగళవారం ముగిశాయి. వెంకటాపురంలో జరిగిన సదస్సులో 25 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. 14 రెవెన్యూ గ్రామాల్లో జరిగిన సదస్సులో 241 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ జి.శ్రీనివాసరావు, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ షమీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు

కలిదిండి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ప్రధాన కూడళ్లలో దాతల సాయంతో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కలిదిండి ప్రధాన సెంటర్‌లో 4, బస్టాండ్ వద్ద 3, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద 2, జడ్పీ హైస్కూల్ వద్ద 2, గుర్వాయిపాలెంలో 3, కోరుకొల్లులో 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 50 మీటర్ల దూరంలో ఉండే వాహనాలను గుర్తించే వీలుగా కెమెరాలు అమర్చారు. వీటిని పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కలిదిండి పట్టణం మొత్తం నిఘా నీడలో ఉంది. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు జరిగిన వెంటనే నిందితులను పట్టుగోలుగుతామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో గతంలో ఎన్నో కేసులను ఛేదించగలిగామని, ప్రస్తుతం వీటి సంఖ్య పెరగటం వల్ల కలిదిండి మండలంలో ఎటువంటి నేరాలు జరిగినా క్షణంలో గుర్తించే వీలుంటుందన్నారు.

కొత్త ఏడాది నూజివీడుకు వరాలు

'ఆంధ్రజ్యోతి'తో మంత్రి పార్థసారథి



నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ నూజివీడు నియోజకవర్గానికి అనేక వరాలు అందును న్నాయి. ఇప్పటివరకు నూజివీడు నియోజకవర్గంలో ఏ శాసన సభ్యుడు ప్రకటించని విధంగా రాష్ట్ర గృహ నిర్మాణ పౌరసంబంధాల సమాచారశాఖ మంత్రి, నూజివీడు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి నియో జకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టను న్నట్లు మంగళవారం నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం నూజివీడు నియో జకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు దీటుగా నూజివీడును అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నూజివీడు అభివృద్ధిపై ఆయన మాటల్లోనే..

- రూ.100కోట్ల వ్యయంతో నూజివీడు నియోజకవర్గానికి జలజీవన్‌మిషన్ ద్వారా తాగునీరు, సాగునీటి పంపిణీకి చర్యలు.
- జమిందారి కాలంనాటి నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నూతనంగా రింగ్‌రోడ్డు ఏర్పాటు పనులు ప్రారంభం. ఈ ఏడాదిలోనే చేపట్టనున్నాం. మొదటిదశ పూర్తి ఈ ఏడాదిలోనే జరుగుతుందని స్పష్టం చేశారు.
- నూజివీడు పేరు చెబితే గుర్తుకువచ్చే మామిడికి స్థానికంగా మార్కెట్ లేకపోవడం శోచనీయం. దీన్ని గుర్తించి నూజివీడు ఏఎంసీ వేదికగా మామిడి మార్కెట్ యార్డు ఏర్పాటు. ఈ మామిడి సీజన్‌కే అందించనున్నట్లు స్పష్టం చేశారు.
- చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు పర్యావరణ అనుమతులు అవసరం అయ్యాయి. ఢిల్లీ కేంద్రంగా అనుమతులు కోసం కృషి చేసి త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.
- విద్య, క్రీడలకు నూజివీడు పుట్టినిల్లు. అయితే క్రీడాభివృద్ధికి అవసరమైన క్రీడాస్థలాలు లేకపోవడంతో లోటు ఉంది. దీన్ని పరిష్కరించేందుకు ఇండోర్ స్టేడియం పూర్తి చేయడంతో పాటు అవుట్‌డోర్ స్టేడియాన్ని నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నాం.
- నూజివీడు పట్టణంలో డ్రెయినేజి వ్యవస్థ అభివృద్ధికి చర్యలు
- ఆగిరిపల్లిలోని లక్ష్మీనరసింహాస్వామి దేవాలయానికి ఘాట్‌రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. దాన్ని ఈ ఏడాది పూర్తి చేస్తాం.

- నూజివీడు

ఉర్దూ పాఠశాలలో కొత్త వేడుకలు

చాట్రాయి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తుమ్మగూడెం ఎంపీపీఎస్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. న్యూఇయర్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు పాటలు పాడి నృత్యాలు చేశారు. హెచ్‌ఎం వెంకట్రావు తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో సామాజిక భద్రత

చాట్రాయి, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీతో సామాజిక భద్రత కల్పిస్తున్నదని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని సోమవరం, చాట్రాయి గ్రామాల్లో మంగళవారం మంత్రి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో జనవరి నెలకు గాను 2.62 లక్షల మందికి రూ.113 కోట్లు పెన్షన్లు పంపిణీ చేశామని, చాట్రాయి మండలంలో 8322 మందికి రూ.3.51 కోట్లు పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన రూ.1670 కోట్లు రైతులకు చెల్లించామని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ధాన్యం డబ్బులు 24 గంటల్లో చెల్లించిన ఘనత చంద్రబాబు సర్కార్‌దే అన్నారు.

పింఛన్లు పంపిణీలో నూజివీడుకు రెండవ స్థానం

నూజివీడు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో నూజివీడు మండలం రెండో స్థానంలో నిలిచింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 10,413 మంది పింఛన్ దారులకు గాను 9,964 పింఛన్‌లను పంపిణీ చేసి నూజివీడు మండలం 95.69శాతం పింఛన్‌లను లబ్ధిదారులకు అందించి, జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రభు దీపిక



నూజివీడు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):అండర్ -16 జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు విక్టోరియాటౌన్‌హాల్ క్రీడాకారిణి ఎంపికైనట్లు కోచ్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడు బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.ప్రభుదీపిక గుజరాత్‌లోని బావనగర్‌లో నిర్వహిస్తున్న జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. జనవరి 1వ తేదీనుంచి 12వ తేదీవరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఆమె పాల్గొంటుందని ఆయన తెలిపారు.

కాకినాడ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి

ముసునూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా యూటీఎఫ్‌శాఖ ఆధ్వర్యంలో చేప ట్టిన ప్రచారజాత ముసునూరు మండలం రమణక్కపేట గ్రామానికి మంగళవారం చేరింది. ఈ ప్రచారజాతకు మండల యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరుజిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు షేక్ ముస్తాఫ్‌ఆలీ, ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష రవికుమార్, రాష్ట్రకార్యదర్శి బోరా సుభాషిణి, గౌరవ అధ్యక్షులు శ్యామ్‌బాబు, సహాయ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు రమణక్కపేట ప్రధాన కూడలిలో నినాదాలు చేశారు.

అదుపుతప్పి కాల్వలోకి దూసుకువెళ్లిన ట్రాక్టర్



పోల్‌రాజ్ కాల్వలోకి దూసుకువెళ్లిన ట్రాక్టర్

మండవల్లి డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుకొల్లు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పోలరాజ్‌కాల్వలోకి దూసుకెళ్లింది. కైకలూరు నుంచి ముదినేపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ మంగళవారం జాతీయ రహదారి పక్కన పోల్‌రాజ్ కాల్వలోకి దూసుకువెళ్లింది. ఆ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్ల ట్రాక్టరు అదుపు చేయలేకపోయాడని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదని తెలిసింది.

వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదం : 8ఎకరాల గడ్డివాము దగ్ధం



పల్లెవాడలో మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

కైకలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదాల్లో 8 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. ఆచవరంలో మాడపాటి వీర్రాజుకు చెందిన సుమారు 2 ఎకరాల గడ్డివాము, పల్లెవాడలో వేల్పూరి రాంబాబుకు చెందిన 6 ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతయ్యాయి. గడ్డివాముల నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు కైకలూరు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివాము చాలా వరకు దగ్ధమైంది. ఆయా రైతులు పశువులకు ఆహారంగా ఇతర ప్రాంతాల నుండి వరిగడ్డి కొనుగోలు చేశారు. రెండు చోట్ల జరిగిన అగ్నిప్రమాదాల్లో సుమారు రూ.1.60లక్షలు రైతులు నష్టపోయినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జగదీశ్

కైకలూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా బోడావుల జగదీశ్‌ను ఎన్నుకున్నారు. కైకలూరులో మంగళవారం జరిగిన సమావేశంలో వేమవరప్పాడుకు చెందిన బోడావుల జగదీష్‌ను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా బి.వెంకట్రాజు వ్యవహరించారు. మండల ప్రతినిధిగా కట్టా వీరరాఘవులును ఎన్నుకున్నారు. వేంపాటి విష్ణురావు, కీర్తి వెంకటరాంప్రసాద్, బొల్లా శ్యామలరాజు, మోదుగుమూడి లక్ష్మయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ట్రిపుల్ఐటీ అధికారుల కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ట్రిపుల్ఐటీ డైరెక్టర్, ఇతర అధికారులు

నూజివీడు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):నూజివీడు ట్రిపుల్ఐటీ క్యాంపస్లో విద్యార్థి అత్యవసర చికిత్సకు సహాయసహకారాలు అందించిన విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే. నూజివీడు ట్రిపుల్ఐటీ క్యాంపస్లో ట్రిపుల్ఈ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.అనూష డిసెంబర్ 19వ తేదీ బ్రెయిన్స్ట్రోక్కు గురైంది. ఇందుకు సంబంధించి అత్యవసరచికిత్సకు విద్యార్థులు, అధ్యాపకులు సహాయసహకారాలు అందించినా అనంతరం చికిత్సకు భారీ మొత్తంలో నగదు అవసరమైంది. ఈ విషయాన్ని నారా లోకేశ్, చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆమె వైద్యఖర్చుల కోసం తక్షణం రూ.12లక్షలను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో నూజివీడు ట్రిపుల్ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, యోగాశిక్షకులు అక్కినేని సత్యశ్రీధర్, ఇతర అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నరసింహారావు భౌతికకాయానికి మంత్రుల నివాళి



నరసింహారావు భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల

చాట్రాయి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):చిన్నంపేటలో సోమవారం మృతి చెందిన మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అత్తులూరి నరసింహారావు భౌతికకాయానికి మంగళవారం తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, వివిధ పార్టీల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

విజయ డెయిరీ క్యాలెండర్ ఆవిష్కరణ

చాట్రాయి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్(విజయ డెయిరీ) 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను మంగళవారం చీపురుగూడెం పాల సహకార సంఘంలో సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు ఆవిష్కరించారు. విజయవాడ వరదల్లో కృష్ణామిల్క్ యూనియన్ పాల ఫ్యాక్టరీ నీట మునిగి తీవ్రంగా నష్టపోయినా, ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాల వలన విపత్కర పరిస్థితిని అధిగమించి రైతులకు పాల రేటు పెంచి బోనస్ పంపిణీ చేయటం గొప్ప విషయమన్నారు.

గ్రామాల్లో కుక్కలకు వ్యాక్సిన్

ముసునూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలకు సైతం ఏ.ఆర్.వి వ్యాక్సిన్ వేసే ప్రక్రియను చేపట్టినట్లు నూజివీడు పశుసం వర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ రావు తెలిపారు. మంగళవారం ముసునూరు పశువైద్యశాలలో పంచాయతీ పాలక సభ్యులు, కార్యదర్శితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డి.డి మాట్లాడుతూ గ్రామాల్లో అక్కడక్కడ పిచ్చికుక్కలు ఉండటం వల్ల ప్రజలు భయాందోళ చెందుతున్నారని, పశువుల పై కూడా కుక్కలు దాడిచేయటం వల్ల పశు పోషకులు నష్టపోతున్నారన్నారు. గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు వ్యాక్సిన్ ప్రక్రియకు సహకరించాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఈ వ్యాక్సిన్ పై దండోరా వేయించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ తనయుడు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి), ఉపసర్పంచ్ తోటా శ్రీనివాసరావు, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తపాలా సేవలు ప్రజలకు చేరువ చేయాలి

నూజివీడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా అందిస్తున్న బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని పోస్టల్ డిపార్ట్మెంట్ గుడివాడ డివిజన్ సూపరింటెం డెంట్ చెల్లా అప్పారావు సూచించా రు. నూజివీడు మెయిన్ పోస్టా ఫీస్లో సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ్డాక్సేవక్, బి.పి.ఎం, ఏ.బి.పి.ఎంలతో పోస్టల్ సేవలకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలాశాఖ ద్వారా ఇన్సూరెన్స్ను అందించడంతో పాటు డైరెక్ట్ బెనిఫిట్స్కీమ్ అకౌంట్లను అందించటం జరుగుతోందన్నారు. పోస్ట్ మాస్టర్ పెంచలయ్య, అసిస్టెంట్ పోస్ట్మాస్టర్ కృష్ణారావు, ఆర్.పి. ఎల్.ఎఫ్ కరణ్ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో 96శాతం పింఛన్ పంపిణీ

ముసునూరు, డిసెంబరు 31 (ఆంధ్ర జ్యోతి):ముసునూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పంపిణీ 96శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. 1వ తేదీ నూతన సంవత్సరం కావడంతో ఒకరోజు ముందుగా మంగళవారం పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ముసునూరులో మద్దాల స్వప్నజ్యోతికి గత ప్రభుత్వంలో రూ.6వేలు దివ్యాంగ పింఛన్ రాగా, కూటమి ప్రభుత్వంలో ఆమెకు రూ.15వేలు మంజూరు కాగా సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి పింఛన్ను అందచేశారు. పింఛన్లు పంపిణీని ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ పర్యవేక్షించారు. అన్ని గ్రామాల్లో పింఛన్ పంపిణీలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సాధారణ పని దినం

ఏలూరు సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం మొదటి రోజు సాధారణ పనిదినం నిర్వహించనున్నారు. మాజీ ప్రధాని మంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1 వరకు సంతాప దినాలు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనవరి 1 సాధారణ పనిదినంగా పరిగణిస్తారు. జిల్లా అధికారులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కలుసుకోవచ్చు, కేక్ కటింగ్, టీ, కాఫీలు, పూలదండలు అనుమతించరు. సంతాప దినాలు పూర్తికానందున వేడుకలు జరుపరాదని కలెక్టరేట్ అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఆశలు ఆకాంక్షలు



కొత్త ఏడాది ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలు. వీటి వెంటే సరికొత్త సవాళ్లు. ఉచితంగా బస్సు ఎక్కాలని మహిళలు. వందనం కోసం తల్లి ఎదురుచూపులు. ప్రాజెక్టు పనులన్నీ కొలిక్కిరావాలని, గతం కంటే మరింత సంతృప్తిగా పంట, దిగుబడి, ధర చేతికందాలని రైతులు. నామినేటెడ్ కుర్చీకోసం నేతలు. చదువులో రాణించాలని విద్యార్థులు. కొత్తకొత్త ప్రయోగాలతో కూటమి ప్రభుత్వం.. ఈ దిశగానే నూతన అధ్యాయం దిశగా అడుగులు. మహిళలకు పోలీసుల రక్షాకవచం. సైబర్ నేరాలకు కళ్లెం. జిల్లాలో అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రాలు. పేకాట దగ్గర నుంచి కోడి పందేలు వరకు కట్టడి. శాంతి.. భద్రతకే అత్యధిక ప్రాధాన్యం. ఇలా ఒక్కొక్కటి ఒక్కో ఆశ. రాబోయే 365 రోజులు వచ్చిపడే ఉపద్రవాల నుంచి ప్రజలను రక్షించడం, ఒత్తిడి తగ్గించడం, ఆర్థికంగా వెసులుబాటు కల్పించ దం, రాజకీయాల్లో సమున్నతంగా వ్యవహరించేలా నేతలకు దిశ, దశ నిర్దేశించడం ఈ ఏడాదే అన్ని పార్టీల ముందున్న లక్ష్యాలు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)


ఏలూరు మార్కెట్‌లో న్యూ ఇయర్‌ను స్వాగతించే వెలుగుల బోకేలు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆంగ్ల సంవత్సరానికి అంతటా జేజేలు. గత అనుభవాల క్రీనీడల నుంచి సరికొత్త వెలుగులు తెచ్చే కొత్త సంవత్సరానికి స్వాగతం. ఏడాది పొడుగునా సరికొత్త లక్ష్యాలను చేరుకోవాలని. అందరి ఆకాంక్ష ఇదే. ఇప్పటి నుంచే సరికొత్త పాఠాలు. విద్యార్థుల నుంచి ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, రైతులు.. ఇలా అన్ని వర్గాలు రాణించేలా కూటమి ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు పొంచి ఉన్నాయి. గత ఏడాది ఒక్కొక్కటిగా సంస్కరణలు చేస్తూ, పాత వాసనలు వదిలిస్తూ, ఒక్కో అడుగు ముందుకేస్తూ కొత్త ఏడాదిలోకి కూటమి ప్రభుత్వం అడుగు పెడుతోంది. ఇంతకుముందు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 ఇప్పటికీ అందరి నోట నానుతోంది. మిగతా రాష్ట్రాలకు ధీటుగా పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడం ఒక ఎత్తయితే.. దానిని ఠంచన్‌గా అందించడం మరో ఎత్తు. అనుకున్నది అనుకున్నట్టుగా ఒక్కో పథకాన్ని లైన్‌లో పెట్టి ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేయడం మరొక ఎత్తు. సూపర్-6లో భాగమైన మహిళలు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి వాటికి ఈ ఏడాదే అంకురార్పణ జరగబోతుందని ఆశ. వీటితోపాటు ఇతర హామీల అమలుకు మహిళలు, ఇతర వర్గాలు ఎదురుచూస్తున్నాయి. కూటమి ప్రభుత్వ చర్యలతో మార్పును ఇప్పటికే స్వాగతిస్తూ వస్తున్న వారంతా పథకాల అమలులో వేచి చూసే ధోరణిలోనే ఓర్పు. విద్యా సంస్కరణల్లో కూటమి ఇప్పటికే తొలి అడుగు వేసింది.


ఏలూరులో పూల బొకే దుకాణాల వద్ద రద్దీ

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలులోకి వచ్చింది. దీనికితోడు పాత విధానాలను మార్చి చదువుల్లో నిలదొక్కుకునేలా అటు ఉపాధ్యాయ వర్గానికి, ఇటు విద్యార్థి లోకానికి సరికొత్త బాటలేస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచే సంస్కరణల ప్రభావం ఉండేలా జాగ్రత్తపడుతోంది. విద్యార్థులకు ఇచ్చే స్కూల్ బ్యాగ్‌ల దగ్గర నుంచి అన్నింటా జాగ్రత్త పడుతుంది. కొత్త జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలకు ఈ ఏడాదే శ్రీకారం

- కొత్త ఏడాది సరికొత్త లక్ష్యాలెన్నో
- కూటమి ప్రభుత్వానికి సవాళ్లు
- సంస్కరణలకు నాంది కావాలి
- సాగు, తాగునీటికి ముందస్తు ప్రణాళిక
- నూతన విజయాలకు అంకురార్పణకు ఇదే సమయం



కేంద్రం ఓ చూపు చూడాలి

జిల్లాలో కొవ్వూరు-భద్రాచలం కొత్త రైల్వే లైను నిర్మాణం ఈ ఏడాదే ఆరంభమయ్యేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. ఇది ఒక కొలిక్కి వస్తే జిల్లాలో రవాణా రంగంలోనే సరికొత్త ఒరవడికి పునాది పడబోతుంది. ఇంకోవైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తి చేయాల్సి ఉంది. రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిగా అందించాలనే డిమాండ్ ఉంది. సూర్యఘర్ పేరిట సౌర విద్యుత్ జిల్లా అంతటా విస్తరించాల్సిన సమయమిది. ఈ దిశగానే ద్వారకాతిరుమలలో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు తొలి అడుగులు. ఇంకోవైపు బ్యాంకులు ఊతమిస్తే గృహ సముదాయాలపై సౌర శక్తికి మరింత చేయూతనిచ్చినట్టవుతుంది. పంటలకు కనీస ధర కల్పించడంలో గోధుమ పంట మాదిరిగానే వరి, ఇతర పంటలకు ఈసారి ధర పెరిగేలా కేంద్ర సహకారం అవసరం.

చుట్టాల్సి ఉంది. పక్కాగా ప్రణాళిక, అమలు ఇప్పటి లక్ష్యాలు. వీటిని అందుకోవడానికే అందరిదీ ఆత్రుతే. వీటిలో సవాళ్లు ఎదురైనా అధిగమించేందుకు సర్కార్ సాహసిస్తోంది. ఇంకోవైపు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను సంతృప్తిపరిచేలా గడిచిన ఐదేళ్ల లోపాలను ఒక్కొక్కటిగా సవరించాల్సి ఉంది. వీటిలో పాత బకాయిలను కొంతలో కొంత సర్దుబాటు చేయాలి. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా వీటిని దారిలో పెట్టాల్సిన సవాల్ సర్కార్‌దే. పీఎఫ్ నుంచి డీఏ వరకు లక్షల్లో పేరుకుపోయిన బకాయి కోసం వేతన జీవులంతా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలోను పెను మార్పులకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవ సరం ఉంది. ఇప్పటికే బదిలీల పేరిట పాత వాసనలను దూరంగా ఉంచారు. కొన్నింటిలో మాత్రం ఆ వాసన ఇంకా పోలేదు. రాజకీయ జోక్యం, పక్షపాతం కొందరిలో సమసిపోలేదు. అందరికీ సమన్యాయం చేయాలనేదే ఉద్యోగ ధర్మం కాగా, దీనికి విరుద్ధంగా వ్యవహరించే వారికి ఓ షాక్ ఇవ్వాలి. ఈ ఏడాది యంత్రాంగంలో పెను మార్పులకు ఇదే అతి పెద్ద సంకేతం అయ్యేటట్టు చూడాలన్న సర్కారు ప్రభుత్వం వైపు ఉంది. జిల్లా కేంద్రంలో ప్రతీ సోమవారం సాగే వినతుల స్వీకరణ ఆర్డీవో, మునిసిపల్ కేంద్రాలకు విస్తరించాలని తలపె ట్టారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలకు ఇదొక పెద్ద వెసులుబాటు. పెన్షన్లు, సొంత గృహాలు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం వేలాది మంది ఎదురుచూపులు. టిడ్కో ఇళ్లు ఎవరి సొంతం చేస్తారో సర్కారు నిర్ణయించేది ఈ ఏడాదే. ఇప్పటికే బోగస్ పెన్షన్ల పరిశీలన పూర్తయ్యింది. ఒక రేషన్‌కార్డులోనే చేర్పులు, మార్పులకు అవకాశం. ఈ మూడింటిలో ప్రభుత్వ కీలక నిర్ణయానికి అవకాశం. కొత్త రోడ్ల నిర్మాణమే కాకుండా గుంతలు తేలిన రోడ్లకు ఇప్పటికే మరమ్మతులు కొలిక్కి వస్తున్నాయి. సంక్రాంతి లోపే గుంతలు రహిత రాష్ట్రంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు ఆశయం నెరవేరడానికి సమయం వచ్చింది.

రాజకీయ సవాళ్లెన్నో..

ఒకవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాకుండా వీటిని అమలు చేయడం కూటమి ప్రభుత్వానికి ఈ ఏడాది సరికొత్త సవాల్. ముఖ్యంగా జనం ఏ వైపు మొగ్గు చూపుతున్నారో ఆ దిశగానే అడుగులు కదపాల్సిన అవసరం ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల తొలగింపు ఈ ఏడాదైనా జరుగుతుందనే ఆశతో అనేక మంది ఉన్నారు. ఈ కేసుల్లో భాగంగా కోర్టుల చుట్టూ తిరిగి కష్టాలు పడుతున్న వారంతా తమను గట్టెక్కించాలనే కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. ప్రత్యేకించి పార్టీ కోసం కష్టపడిన వారంతా తమకు గౌరవప్రదమైన నామినేటెడ్ పదవి దక్కాలని ఆశిస్తున్నారు. ఈ ఏడాదిలోనే మార్కెట్ కమిటీలు, సహకార కమిటీలు కూడా ఒక కొలిక్కి రాబోతున్నాయి. వీటికి తోడు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల కోసం క్యూ కట్టిన అనేక మంది కుర్చీ తమకే దక్కుతుందని ఆశతో కంటున్న కలలు సాకారం కావాలనుకుంటున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇప్పటికే బలపడి ఉండగా, వైసీపీ నిలదొక్కుకోవడానికి ఈ ఏడాది మరిన్ని ప్రయత్నాలు చేయబోతుంది. ఆ పార్టీ క్షేత్రస్థాయిలో దెబ్బతిని దిగాలు పడింది. రాజీనామాలతో పార్టీలో చాలా వెలితి కనిపిస్తోంది. దీని నుంచి బయటపడేందుకు ఆ పార్టీ అస్త్రశస్త్రాలకు ఈ ఏడాది పదును పెట్టాలని తెగ ఆరాటపడుతుంది. అంతో ఇంతో పాత వాసనలతో నెట్టు కొస్తున్న కాంగ్రెస్, వామపక్షాలు కూడా ఈ ఏడాదైనా కలిసొస్తుందని ఆశలు పెంచుకున్నాయి.



తాగు, సాగు నీరు

ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది తాగు, సాగునీటి కటకట ఏర్పడకుండా లక్ష్యాలు నిర్దేశించాలి. ఇప్పటికే సాగునీటి సౌకర్యం మెరుగుపరిచే దిశగా సర్కార్ వేగం పెంచాలి. రెండో పంట గట్టెక్కేలా, రాబోయే ఖరీఫ్ సరైన సమయంలో ఆరంభమయ్యేలా చర్యలకు దిగాలి. రైతుకు సరైన దిగుబడి రావడమే కాకుండా మార్కెట్‌లో ధర వరలు సంతృప్తికరంగా ఉండేలా చూసే బాధ్యత సర్కారుదే. ఈఏడాది పత్తి, మిరప, పొగాకు, పామాయిల్, వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఉద్యాన పంటల ప్రోత్సాహకానికి కేంద్ర, రాష్ట్రాల నుంచి మరింత ప్రోత్సాహకాలు అందేలా చర్యలు ఉండాలి. పోలవరం ప్రాజెక్టుతోపాటు చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలు ఓ కొలిక్కి రావాలి. మిగిలిన రిజర్వాయర్లలో సాగునీటి నిర్వహణ పద్ధతులు రావాల్సిందే. తాగునీటి అవసరాలను గుర్తించి ఆ మేరకు ముందస్తుగా జనవరిలోనే రంగం సిద్ధం చేయాలి. పంచాయతీరాజ్ శాఖ అప్రమత్తం కావాలి. కుళాయి నీరు కల సాకారమవ్వాలి. రైతు కూలీలకు ఉపాధి హామీ మరింత ఊతమివ్వాలి. ఇవన్నీ చేయాలంటే సర్కారుతోపాటు ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని విజయాలు సాధించాలి.



సందడే.. సందడి

జిల్లా అంతటా న్యూ ఇయర్ సంబరాలు

పండ్లు, పూల బొకేలతో పరస్పర శుభాకాంక్షలు

ఏలూరు సిటీ/రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సందడే సందడి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం అర్ధరాత్రి యువత కేరింతలు కొట్టారు. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2025 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఏలూరు నగరంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. ప్రత్యేకంగా ఫుడ్ ప్యాకెట్ల దుకాణాలు వాడవాడలా వెలిశాయి. ఆఫర్లతో బిరియానీ ప్యాకెట్లు అమ్మకాలు సాగించారు. పండ్ల దుకాణాలు బిజీగా కనిపించాయి. పూల బొకేలు అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. బేకరీ, స్వీట్ షాపులు కిటకిటలాడాయి. ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు చోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షల సందేశాలిచ్చారు.

హోటళ్లలో ప్రత్యేక ఆఫర్లు

ఇక హోటళ్లలో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. బిరియానీ, ఫ్రైడ్‌రైస్ కొనుగోలుపై డిస్కౌంట్, డ్రింక్ బాటిల్ ఉచితంగా ఇచ్చారు. నాన్ వెజ్ ఐటెమ్స్‌కు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. బేకరీ షాపులలో కేక్‌లకు మంచి గిరాకీ పెరిగింది. కేక్‌లను ముందుగానే ఇచ్చిన ఆర్డరుపై తయారు చేసి అమ్మకాలు చేశారు. సోషల్ మీడియా ప్రభావంతో గ్రీటింగ్స్ అమ్మకాలు బాగా తగ్గాయని చెబుతున్నారు. మార్కెట్‌లో పూలు, పండ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. బొకేలు, కేక్‌ల ధరలు రెట్టింపయ్యాయి. మద్యం షాపులు రద్దీగా కనిపించాయి. వస్త్రదుకాణాలు, మోటార్ సైకిల్, కార్ల షోరూంలు హడావుడిగా కనిపించాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయాలు, చర్చిలలో కూడా సందడి నెలకొంది.

ప్రజలకు మంచి జరగాలి : కలెక్టర్



నూతన సంవత్సరం ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ కె వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు 2025లో అంతా మంచి జరగాలని, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లాలో మంచి పంటలు పండి, విద్యా, పారిశ్రామిక అభివృద్ధి సాధించాలన్నారు. - ఏలూరు సిటీ

అంతా ప్రశాంతంగా ఉండాలి : ఎస్పీ



ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరాన్ని కుటుంబ సభ్యుల తో ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ కేపీఎస్. కిశోర్ అన్నారు. ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. 2025లో పోలీస్ శాఖ ప్రత్యేక లక్ష్యాలతో ముందడుగు వేస్తామన్నారు. జిల్లాలో నేరస్తులపై నిఘా పెట్టి ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని అదే విధంగా ప్రజలకు శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే రౌడీషీటర్లపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. - ఏలూరు క్రైం

రెవెన్యూ సదస్సులలో అర్జీలు

త్వరితగతిన పరిష్కారం

ఏలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభల్లో అర్జీలను త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తోందని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి పీజీఆర్ఎస్ (రెవెన్యూ) సదస్సులు, రీసర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో భూపరిపాలన, ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి పట్టాదార్ పాస్‌పుస్తకం, ఇళ్ల స్థలాలు, మ్యుటేషన్స్ తదితర అర్జీల పరిష్కార తీరును కలెక్టర్ కె.వెట్రిసెల్వి వివరించారు. జిల్లాలో 479 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, 4831 అర్జీలు స్వీకరించగా, 1793 అర్జీలు పరిష్కరించామన్నారు. కమిషనర్ జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులపై అధికారులు సదస్సులు ముగిసే వరకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రజల సంతృప్తిస్థాయి మెరుగ్గా ఉండేలా తహసీల్దార్లు పని చేయాలన్నారు.